# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 10, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజీలు : 08, వెల రూ. 5రూ/ శుక్రవారం -09 - మే - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad



విలేకరులు కావలెను

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను.

అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948


## ఆపరేషన్ సిందూర్‌లో 100 మంది ఉగ్రవాదులు హతం రాజ్‌నాథ్ సింగ్

- ‘ఆపరేషన్ సిందూర్’పై కేంద్రం అఖిల పక్ష సమావేశం



- ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించిన రాజ్‌నాథ్ సింగ్
- ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని స్పష్టీకరణ
- దేశం కోసం కేంద్రం తీసుకునే చర్యలకు పూర్తి మద్దతు ఉంటుందన్న రాహుల్ గాంధీ మిగతా..2లో

## రంగంలోకి సౌదీ అరేబియా, ఇరాన్

### భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు..



హఠాత్తుగా ఢిల్లీకి వచ్చిన సౌదీ విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి

ఢిల్లీలో జైశంకర్‌తో సౌదీ, ఇరాన్ మంత్రుల వరుస భేటీలు

భారత్-పాక్ మధ్య శాంతి యత్నాలకు సౌదీ, ఇరాన్ చొరవ

## పునర్విభజన చట్టంలో అమరావతి పేరు..

# ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం



అమరావతి: పునర్విభజన చట్టంలో విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధాని స్థానంలో అమరావతి పేరు చేర్చే ప్రతిపాదనకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అమరావతి పేరును పునర్విభజన చట్టంలో చేర్చేలా చట్ట సవరణ చేయాలని క్యాబినెట్ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని కేంద్రానికి పంపించనున్నారు. అలాగే, ఈ భేటీలో అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ కి క్యాబినెట్ ధన్యవాదాలు తెలిపింది. 47వ సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాజధాని పరిధిలో వివిధ సంస్థలకు భూకేటాయింపులకు ఆమోదం తెలిపింది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర సంక్షేమ కార్యక్రమాలపై చర్చించింది. తీరప్రాంత భద్రత, రక్షణ రంగ పరిశ్రమల వద్ద జాగ్రత్తలు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించింది. ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన మిగతా..2లో

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
- ఈ భేటీలో అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీకి క్యాబినెట్ ధన్యవాదాలు
- 47వ సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదముద్ర
- రాజధాని పరిధిలో వివిధ సంస్థలకు భూకేటాయింపులకు ఆమోదం





## ప్రధాని మోదీ ఓ ‘అనికేత్’: పవన్ కల్యాణ్

- అనికేత్ అంటే ఇల్లు లేని వాడని అర్థమన్న పవన్
- శివుడికి కూడా అనికేత్ అనేది ఒక పేరు అని చెప్పిన డిప్యూటీ సీఎం
- ఆపరేషన్ సిందూర్ కు పూర్తి మద్దతు తెలిపిన పవన్

### రాహుల్ గాంధీ ఎంపీ సభ్యత్వంపై

## పిటిషన్ కొట్టివేత

అలహాబాద్ హైకోర్టులో రాహుల్‌కు ఊరట

రాహుల్ పౌరసత్వంపై ఆధారాలు లేవన్న కోర్టు

పిటిషనర్‌కు చుక్కెదురు, పిటిషన్ కొట్టివేత

ఎంపీగా రాహుల్ కొనసాగింపునకు అడ్డంకి లేదని స్పష్టీకరణ



ఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు బుధవారం కొట్టివేసింది. గతంలో నమోదైన పరువునష్టం కేసులో శిక్ష పడటం, ఆయన పౌరసత్వానికి సంబంధించి అపరిష్కృతంగా ఉన్న ప్రశ్నలను కారణంగా చూపుతూ మిగతా..2లో

## బలూచిస్థాన్‌లో బీఎల్‌ఏ దాడి..

# 14 మంది పాక్ సైనికుల మృతి




బలూచిస్థాన్‌లో బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) రెండు దాడులు

మొత్తం 14 మంది పాకిస్థాన్ సైనిక సిబ్బంది మృతి

బోలాన్, కేచ్ జిల్లాల్లో రిమోట్ కంట్రోల్డ్ ఐఈడీలతో దాడులు

మృతుల్లో స్పెషల్ ఆపరేషన్స్ కమాండర్, సుబేదార్

దాడులకు బాధ్యత వహించిన బీఎల్‌ఏ, పాక్ సైన్యంపై తీవ్ర విమర్శలు

ఢిల్లీ: పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో మరోసారి నెత్తురు పారింది. వేర్పాటువాద సంస్థ బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) జరిపిన మిగతా..2లో



## ఆపరేషన్ సిందూర్ మరో విజయం...

### భారత విమానం హైజాక్ సూత్రధారి అబ్దుల్ రవూఫ్ హతం

జైషే మహమ్మద్ కమాండర్ అబ్దుల్ రవూఫ్ అజార్ హతం

‘ఆపరేషన్ సిందూర్’లో భారత బలగాల దాడిలో మృతి

# అధికారంలోకి వచ్చాక సినిమా వేరే లెవెల్‌లో ఉంటుంది

- వైసీపీ కార్యకర్తల బాధలు, కష్టాలను స్వయంగా చూస్తున్నా
- అందుకే జగన్ 2.0లో టాప్ ప్రయారిటీ కార్యకర్తలకే ఇస్తా
- ఇబ్బంది పెడుతున్న పోలీసులు, అధికారుల పేర్లను నోట్ చేసి పెట్టుకోండి
- వాళ్లకి యూనిఫామ్ విలువ ఏంటో తెలిసేలా చేసా



అమరావతి: వైసీపీ కార్యకర్తలను వేధించిన పోలీసులు, అధికారులను విడిచిపెట్టే ప్రసక్తే లేదు..అని వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ హెచ్చరించారు. వైసీపీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో సమావేశమైన ఆయన కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జగన్ మాట్లాడుతూ.. వైసీపీ కార్యకర్తల బాధలు, కష్టాలను స్వయంగా చూస్తున్నా. అందుకే జగన్ 2.0లో టాప్ ప్రయారిటీ కార్యకర్తలకే ఇస్తా. మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్న పోలీసులు, అధికారుల పేర్లను నోట్ చేసి పెట్టుకోండి. వాళ్లకి యూనిఫామ్ విలువ ఏంటో తెలిసేలా చేస్తా. రిటైర్ అయినా, దేశం దాటినా.. సప్త సముద్రాల అవతల ఉన్నా కూడా తీసుకువస్తాం. చట్టం ముందు దోషులుగా నిలబెట్టి శిక్షిస్తాం. తీసుకొచ్చాక వారికి సినిమా మామూలుగా ఉండదు..వేరే లెవెల్‌లో ఉంటుందంతే..అని జగన్ హాట్ కామెంట్స్ చేశారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో అన్నమయ్య జిల్లా రాజంపేట మున్సిపాలిటీ, మిగతా..2లో

# ఏపీని ఎలక్ట్రానిక్స్ పవర్ హౌస్‌గా మార్చేందుకు ప్రజా ప్రభుత్వం బాటలు

### ఎల్‌జీ శ్రీసిటీ యూనిట్‌కు మంత్రి లోకేశ్ భూమిపూజ

స్థానిక ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపనున్న ఎల్‌జీ యూనిట్

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడ్డాక తొలి ఎఫ్‌డీఐ శ్రీసిటీ ఎల్‌జీ యూనిట్

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీ

తాము రాష్ట్ర భవిష్యత్తును నిర్మిస్తున్నామన్న మంత్రి లోకేశ్




అమరావతి: రాష్ట్రంలో సృష్టించబడే ప్రతి ఉద్యోగం, ఆవిష్కరణ ద్వారా ఆంధ్రప్రదేశ్ ను ఎలక్ట్రానిక్ పవర్ హౌస్ గా మార్చేందుకు బాటలు వేస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. అంతర్జాతీయస్థాయి గృహోపకరణాల తయారీ సంస్థ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ శ్రీసిటీ యూనిట్‌కు లోకేశ్ నేడు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.... “మేం ఈరోజు ఎల్‌జీ యూనిట్ కు మాత్రమే కాదు... ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం కొత్త పునాదులు వేస్తున్నాం. ఈ కార్యక్రమం ఒక నిర్మాణ ప్రాజెక్టు ప్రారంభం కంటే పెద్దది. ఇది మన రాష్ట్రంతో పాటు భారతదేశ పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక పురోగతిలో ఒక మైలురాయి. ఆవిష్కరణ పెట్టుబడిని కలిసే చోట, భవిష్యత్తు రూపుదిద్దుకుంటుంది. రూ. 5,000 కోట్లకు పైగా పెట్టుబడితో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రపంచ స్థాయి తయారీ మిగతా..2లో

### ‘ఆపరేషన్ సిందూర్’ గురించి అన్ని

## రాజకీయ పార్టీలకు వివరించడానికి కేంద్రం అఖిలపక్ష సమావేశం



ఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ గురించి అన్ని రాజకీయ పార్టీలకు వివరించడానికి కేంద్రం గురువారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించారు. ఉదయం 11 గంటలకు రాజ్‌నాథ్ అధ్యక్షతన అన్ని పార్టీల నేతలు సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్, జై శంకర్, కిరణ్ రిజిజు సహా పలువురు కేంద్ర మంత్రులు, మిగతా..2లో



### ఆపరేషన్ సిందూర్‌కు

## సెల్యూట్..

- శత్రుసేనలపై భారత సైన్యం వీరోచిత పోరాటం
- ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ సైన్యం చేస్తున్న పోరాటం అనన్యసామాన్యమైనది
- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మిగతా..2లో

## కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన సంబురం లేకుండా చేస్తున్న కాంగ్రెస్ సర్కార్



నీటిపారుదల శాఖలో ఏఈ, జేటీవోలుగా ఎంపికైన అభ్యర్థుల పరిస్థితి దేవుడు వరమిచ్చినా.. పూజారి వరమివ్వని చందంగా మారింది

పెండ్లి పేరుచెప్పి పదో తరగతి ఫలితాలు వాయిదా వేయడం

హైదరాబాద్: నీటిపారుదల శాఖలో ఏఈ, జేటీవోలుగా ఎంపికైన అభ్యర్థుల పరిస్థితి దేవుడు వరమిచ్చినా.. పూజారి వరమివ్వని చందంగా మిగతా..2లో

## ప్రధాని మోదీ ఓ 'అనికేత్': పవన్ కల్యాణ్

అమరావతి: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తనకున్న ప్రగాఢ విశ్వాసాన్ని, అభిమానాన్ని మరోసారి చాటుకున్నారు. ప్రధాని మోదీని "అనికేత్" అంటూ అభివర్ణిస్తూ, ఆయన నిస్వార్థ సేవానిరతిని కొనియాడారు. అదే సమయంలో, ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యలకు, ముఖ్యంగా "ఆపరేషన్ సిందూర్"కు ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీని "అనికేత్"గా పేర్కొంటూ పవన్ కల్యాణ్ ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. "'అనికేత్' ఒక పేరు, ఒక సంకల్పం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సన్యాస జీవితంలో 'అనికేత్' అని పిలువబడ్డారు. అనికేత్ అంటే 'ఇల్లు లేనివాడు' అని అర్థం" అని వివరించారు. సృష్టికి శాశ్వత సన్యాసి అయిన శివునికి కూడా "అనికేత్" ఒక పేరని గుర్తుచేశారు. "వారికి (శివునికి) విశ్వంలోని ప్రతి కణం ఒక ఇల్లు. అయినప్పటికీ వారికి సొంత ఇల్లు లేదు. నేడు కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు, కామాఖ్య నుండి ద్వారక వరకు మొత్తం భారతదేశాన్ని తనదిగా భావించిన అదే 'అనికేత్' (మోదీ), స్వయంగా ఇల్లు లేనప్పటికీ, 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' కింద కోట్లాది మందికి ఇళ్లను అప్పగించారు" అంటూ ప్రశంసించారు.

## శ్రీసిటీకి విమానాశ్రయంతో డైరెక్ట్ కనెక్టివిటీ ఇస్తాం

అమరావతి: అంతర్జాతీయస్థాయి గృహోపకరణాల తయారీ సంస్థ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ శ్రీసిటీ యూనిట్‌కు మంత్రి నారా లోకేశ్ ఇవాళ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.... ఎల్‌జీ యూనిట్ నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇక్కడ అనుబంధ యూనిట్లతో పాటు ఎల్‌జీ సిటీ నిర్మించాలని కోరారు. రాబోయే నాలుగేళ్లలో శ్రీసిటీకి తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంతో డైరెక్ట్ కనెక్టివిటీ కల్పిస్తామని తెలిపారు. పరస్పర విశ్వాసం, ఉమ్మడి శ్రేయస్సు, ప్రపంచాన్ని అనుసంధానించే సమష్టి లక్ష్యంతో కూడిన ఈ భాగస్వామ్యాన్ని కొనసాగిద్దామని ఎల్‌జీ సంస్థ ప్రతినిధులతో మంత్రి అన్నారు. ఒక ప్రతిష్ఠాత్మకమైన యూనిట్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్న ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఎల్‌జీ ఫ్యాక్టరీ ప్రతి యువ ఇంజనీర్, ప్రతి ఆశావహ సాంకేతిక నిపుణుడు, ప్రతి వ్యవస్థాపకుడికి కలల కర్మాగారంగా మారబోతోందని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. భారత్‌లో కొరియా రాయబారి లీ సియాంగ్ హో మాట్లాడుతూ... గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో తమ దేశానికి చెందిన కియా కంపెనీ ఏర్పాటైందని, ఇప్పుడు ఎల్‌జీ వస్తోందని గుర్తు చేశారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తున్న చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ హాంగ్ జు జియోన్, భారత్ లో కొరియన్ రిపబ్లిక్ రాయబారి లీ సియాంగ్ హో, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ హోం సొల్యూషన్స్ సీఈఓ జేచియోల్ లియు, ఎకో సొల్యూషన్స్ సీఈఓ జే సంగ్ లీ, సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి, జిల్లాపరిషత్ చైర్మన్ జి. శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, గాలి భాను ప్రకాశ్, పులివర్తి నాని, కోనేటి ఆదిమూలం, ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్ సెక్రటరీ కాటంనేని భాస్కర్, కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏపీఐఐసీ వైస్ చైర్మన్ అభిషిక్త్ కిశోర్, కాన్సులేట్ జనరల్ (ఏపీ, తెలంగాణ) చుక్కపల్లి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

### బలూచిస్థాన్‌లో బీఎల్ఏ దాడి..
## 14 మంది పాక్ సైనికుల మృతి

మొదటి పేజి తరువాయి

రెండు వేర్వేరు దాడుల్లో మొత్తం 14 మంది పాకిస్థానీ సైనిక సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలు బలూచిస్థాన్‌లో తీవ్రమవుతున్న తిరుగుబాటును, నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను స్పష్టం చేస్తున్నాయి. బోలాన్ జిల్లాలోని మాచ్ ప్రాంతంలోని షోర్కాండ్ వద్ద సైనిక కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని బీఎల్ఏ స్పెషల్ టాక్టికల్ ఆపరేషన్స్ స్క్వాడ్ (ఎస్‌టీవోఎస్) రిమోట్ కంట్రోల్డ్ ఐఈడీతో దాడికి పాల్పడింది. ఈ శక్తివంతమైన పేలుడు ధాటికి వాహనంలోని స్పెషల్ ఆపరేషన్స్ కమాండర్ తారిఖ్ ఇమ్రాన్, సుబేదార్ ఉమర్ ఫరూఖ్‌తో సహా మొత్తం 12 మంది సైనికులు అక్కడికక్కడే మరణించారు. సైనిక వాహనం పూర్తిగా ధ్వంసమైంది. అదే రోజు కేచ్ జిల్లాలోని కులగ్ టిగ్రాన్ ప్రాంతంలో పాకిస్థాన్ సైన్యానికి చెందిన బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌పై బీఎల్ఏ ఫైటర్లు మరో దాడి చేశారు. మధ్యాహ్నం సుమారు 2:40 గంటలకు క్లియరెన్స్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా రిమోట్ కంట్రోల్డ్ ఐఈడీని పేల్చారు. ఈ ఘటనలో ఇద్దరు సైనికులు మృతి చెందారు. ఈ రెండు దాడులకు బాధ్యత వహిస్తున్నట్లు బీఎల్ఏ ప్రతినిధి జీయంద్ బలూచ్ ఒక ప్రకటన విడుదల చేశారు. పాకిస్థాన్ సైన్యం ఒక కిరాయి సైన్యమని, చైనా పెట్టుబడులు, ఇతరుల ప్రయోజనాల కోసం పనిచేస్తోందని ఆరోపించారు. తమ భూమిని ఆక్రమించుకున్న ఈ కిరాయి సైన్యంపై బలూచ్ స్వాతంత్ర్య సమరయోధుల దాడులు మరింత తీవ్రతతో కొనసాగుతాయని హెచ్చరించారు. కాగా, బలూచిస్థాన్ సహజ వనరులతో సమృద్ధిగా ఉన్నప్పటికీ, స్థానిక ప్రజలు పేదరికం, వివక్ష, ఆర్థిక దోపిడీకి గురవుతున్నారని, తమ హక్కులను పాకిస్థాన్ ప్రభుత్వం కాలరాస్తోందని వేర్పాటువాద గ్రూపులు చాలాకాలంగా ఆరోపిస్తున్నాయి. మరోవైపు, బీఎల్ఏ వంటి సంస్థలకు ఆఫ్ఘనిస్థాన్ నుంచి మద్దతు లభిస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తోంది. ఈ తాజా దాడులతో బలూచిస్థాన్‌లో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

### రాహుల్ గాంధీ ఎంపీ సభ్యత్వంపై
## పిటిషన్ కొట్టివేత

మొదటి పేజి తరువాయి



అపరిష్కృతంగా ఉన్న ప్రశ్నలను కారణంగా చూపుతూ ఈ పిటిషన్ దాఖలైంది. అయితే, పిటిషనర్ వాదనలను తోసిపుచ్చిన న్యాయస్థానం రాహుల్ గాంధీకి అనుకూలంగా కీలక వ్యాఖ్యలు చేసింది. రాహుల్ గాంధీ పౌరసత్వం ఆధారంగా ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసేందుకు ఎలాంటి బలమైన, అధికారిక ఆధారాలను పిటిషనర్ కోర్టు ముందుంచలేదని ధర్మాసనం స్పష్టం చేసింది. "ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసేంతటి స్పష్టమైన ఆధారాలేవీ మా ముందు ఉంచలేదు" అని కోర్టు వ్యాఖ్యానించింది. అంతేకాకుండా, రాహుల్ గాంధీ పార్లమెంటరీ కార్యకలాపాల్లో పాల్గొనకుండా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్దిష్ట నిర్ణయం తీసుకోలేదని కూడా హైకోర్టు ప్రస్తావించింది. ఈ విచారణ సందర్భంగా రాహుల్ గాంధీ పౌరసత్వానికి సంబంధించిన అంశాన్ని ముగించడానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి కాలపరిమితి నిర్దేశిస్తూ ఆదేశాలు జారీ చేయలేదని డిప్యూటీ సొలిసిటర్ జనరల్ కోర్టుకు తెలిపారు. ఇక పరువునష్టం కేసుకు సంబంధించిన శిక్షపై సుప్రీంకోర్టు ఇప్పటికే స్టే విధించిందని, అందువల్ల, రాహుల్ గాంధీ పదవిలో కొనసాగే అర్హతను సవాలు చేస్తూ (కో వారంటో రిట్) దాఖలు చేసిన పిటిషన్‌కు బలం చేకూరదని న్యాయస్థానం అభిప్రాయపడింది. "అనర్హతకు సంబంధించిన ఆరోపణలపై ఇప్పటికే ఉన్నత న్యాయస్థానం రక్షణ కల్పించిన నేపథ్యంలో ఈ కోర్టు అలాంటి ఉపశమనంపై విచారణ చేపట్టదు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. శిక్షకు సంబంధించిన ప్రధాన అభ్యర్థనను పిటిషనర్ స్వచ్ఛందంగా ఉపసంహరించుకున్నారని, అందుకే ఆ పిటిషన్ భాగాన్ని "విచారణకు పట్టుబట్టడం లేదు" (నాట్ ప్రెస్డ్)గా పరిగణించి కొట్టివేస్తున్నట్లు కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తుల వల్ల ఎలాంటి స్పష్టమైన ఫలితం రాలేదని కోర్టు గమనించింది. అయితే, ఇప్పటికే చేసిన చట్టబద్ధమైన విజ్ఞప్తి ఏదైనా ఉంటే, దానిని సంబంధిత అధికారం చట్ట ప్రకారం పరిశీలించవచ్చని స్పష్టం చేసింది.

### పునర్విభజన చట్టంలో అమరావతి పేరు..
## ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం

మొదటి పేజి తరువాయి



ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన త్రివిధ దళాలకు క్యాబినెట్ అభినందనలు తెలిపింది. ఆపరేషన్ సిందూర్ అనే పేరు బాగుందని, దేశ ప్రజల భావోద్వేగాలను ప్రతిబింబించేలా ఈ పేరు ఉందని క్యాబినెట్ అభిప్రాయపడింది. ఇదే తరహాలో రాష్ట్రంలోని పలు సంక్షేమ పథకాలకు మంచి పేర్లు పెట్టేలా దృష్టిపెట్టాలని నిర్ణయించింది. దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణానికి సంబంధించి సుదీర్ఘంగా చర్చించారు. విశాఖ, మచిలీపట్నం, నాగాయలంకలలో వంటి ప్రదేశాల్లో భద్రత, కార్యాచరణపై మంత్రులతో సీఎం సుదీర్ఘంగా చర్చించారు. తీర ప్రాంతాల్లో భద్రతకు సంబంధించి జాగ్రత్తగా ఉండాలని మంత్రులకు సీఎం సూచించారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఆర్థిక సాయం పెంపు, రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి మెగా ఈవెంట్స్ నిర్వహించే ప్రతిపాదనకు అంగీకారం తెలిపింది. మున్సిపల్ శాఖ 281 పనులను హైబ్రిడ్ యాన్యూటీ విధానంలో చేపట్టేందుకు ఆమోదం తెలిపింది. వైకాపా హయాంలో ఆమోదించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న 3 చట్టసవరణ బిల్లులను వెనక్కి తీసుకోవాని క్యాబినెట్‌లో నిర్ణయించారు.

### కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన
## సంబురం లేకుండా చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

మొదటి పేజి తరువాయి

పూజారి వరమివ్వని చందంగా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఈ దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వం కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన సంబురం లేకుండా చేస్తున్నదని మండిపడ్డారు. పెండ్లి పేరుచెప్పి పదో తరగతి ఫలితాలు వాయిదా వేయడం, పూటకో కారణం చెబుతూ నియామక పత్రాలు అందజేయకుండా తిప్పి పంపడం ఈ ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రచార ఆర్భాటాలు పక్కనబెట్టి ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు వెంటనే నియామక పత్రాలు అందించాలని డిమాండ్ చేశారు. 'దేవుడు వరమిచ్చినా.. పూజారి వరమివ్వని చందంగా ఉంది ఇరిగేషన్ శాఖలో 224 ఏఈ, 199 జేటీవోలుగా ఎంపికైన అభ్యర్థుల పరిస్థితి. కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన సంబురాన్ని లేకుండా చేస్తున్నది దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వం. పది రోజుల్లో ఐదు సార్లు నియామక పత్రాల అందజేత కార్యక్రమాన్ని వాయిదా వేసి, వారి జీవితాలతో ఆడుకోవడం శోచనీయం. కొండంత సంతోషంతో హైదరాబాద్ కు రావడం, నిరాశతో వెనుతిరిగి పోవడం విద్యార్థుల వంతు అవుతున్నది. పెళ్ళి పేరు చెప్పి, పదో తరగతి ఫలితాలు వాయిదా వేయడం, పూటకో కారణం చెబుతూ, నియామక పత్రాలు అందజేయకుండా తిప్పి పంపడం ఈ ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి అలవాటుగా మారింది. రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రచార ఆర్భాటం పక్కన బెట్టి, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు వెంటనే నియమక పత్రాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్‌లో ప్రతిభ చాటి, ఏఈ, జేటీవోలుగా నియామక పత్రాలు అందుకోబోతున్న అభ్యర్థులకు శుభాకాంక్షలు.'

## అధికారంలోకి వచ్చాక సినిమా వేరే లెవెల్‌లో ఉంటుంది

మొదటి పేజి తరువాయి

వైసీపీ కేంద్ర కార్యాలయంలో అన్నమయ్య జిల్లా రాజంపేట మున్సిపాలిటీ, చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం, శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మున్సిపాలిటీ, పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మున్సిపల్ చైర్ పర్సన్లు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలతో పాటు ఆయా జిల్లాల ముఖ్య నేతలతో జగన్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చూస్తుండగానే ఏడాది గడిచింది. కళ్లు మూసుకుని తెరిస్తే మూడేళ్లు గడుస్తాయి.. మనం గట్టిగా నిలబడి మూడేళ్లు ఇలాగే పోరాడితే, ఆ తర్వాత వచ్చేది కచ్చితంగా మన ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు.. ఇప్పుడు మిమ్మల్ని వేధిస్తున్న వారెవ్వరినీ వదిలిపెట్టబోం.. మనం అధికారంలోకి వచ్చాక, వారిని చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు.

### 'ఆపరేషన్ సిందూర్' గురించి అన్ని
## రాజకీయ పార్టీలకు వివరించడానికి కేంద్రం అఖిలపక్ష సమావేశం

జై శంకర్, కిరణ్ రిజిజు సహా పలువురు కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యారు. అలాగే తృణమూల్ కాంగ్రెస్ నుంచి సందీప్ బందోపాధ్యాయ, డీఎంకేకు చెందిన టీఆర్ బాలు సమావేశంలో పాల్గొన్నారు. ఇతర ప్రతిపక్ష నాయకులలో సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రామ్ గోపాల్ యాదవ్, ఆప్‌కు చెందిన సంజయ్ సింగ్, శివసేన (యూబీటీ)కి చెందిన సంజయ్ రౌత్, ఎన్‌సీపీ (ఎస్పీ)కి చెందిన సుప్రియా సులే, బీజేడీకి చెందిన సస్మిత్ పాత్రా, సీపీఐ(ఎం)కి చెందిన జాన్ బ్రిట్టాస్ ఉన్నారు. ఈ సమావేశంలో పాక్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' వివరాలను రక్షణ మంత్రి పంచుకుంటున్నారు. ఇక, ఈ అఖిల పక్ష సమావేశం గురించి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బుధవారం ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. "2025 మే 8న ఉదయం 11 గంటలకు న్యూఢిల్లీలోని పార్లమెంట్ కాంప్లెక్స్‌లోని పార్లమెంట్ లైబ్రరీ భవనంలోని కమిటీ రూమ్: జీ-074లో ప్రభుత్వం అఖిల పక్ష నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది" అని ఆయన అన్నారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ లో పర్యాటకులపై దాడికి పాల్పడి 26 మంది అమాయకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులపై భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ఆ ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై బుధవారం తెల్లవారుజామున తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ప్రతిదాడికి దిగి పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)తో పాటు పాకిస్థాన్‌లోని మూడు ప్రధాన ఉగ్రవాద సంస్థలు జైషే మహ్మద్, లష్కరే తాయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌లకు చెందిన తొమ్మిది ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది.

## ఏపీని ఎలక్ట్రానిక్స్ పవర్ హౌస్‌గా మార్చేందుకు ప్రజా ప్రభుత్వం బాటలు

మొదటి పేజి తరువాయి




రూ. 5,000 కోట్లకు పైగా పెట్టుబడితో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రపంచ స్థాయి తయారీ యూనిట్‌ను తీసుకురావడమే గాక ఏపీని పెట్టుబడుల గమ్యస్థానంగా ప్రపంచ విశ్వాసాన్ని పునరుద్ఘాటిస్తోంది. మేడ్ ఇన్ ఆంధ్ర నుంచి మేడ్ ఫర్ ది వరల్డ్ వరకు మా జైత్రయాత్ర కొనసాగుతుంది. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ప్రధాన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఒకటిగా ఎల్‌జీ శ్రీసిటీ యూనిట్ ఆవిష్కృతమైంది. పారిశ్రామిక రంగంలో వేగం, బలమైన మౌలిక సదుపాయాలు... ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుపై సీఎం చంద్రబాబు నిబద్ధతకు ఇది అద్దం పడుతోంది. మేము సులభతరమైన వ్యాపారానికి హామీ ఇవ్వడమేగాక స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అనుసరిస్తున్నాం. శ్రీసిటీలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ అత్యాధునిక తయారీ కర్మాగారానికి శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా మీ ముందుకు రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ హాంగ్ జు జియోన్, ఎల్‌జీ, దాని విక్రేత కంపెనీల నాయకత్వ బృందాలు, భాగస్వాములందరికీ నేను హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాను.

మేము రాష్ట్ర భవిష్యత్తును నిర్మిస్తున్నాం!

ఎల్‌జీ ఫ్యాక్టరీ అధునాతన గృహోపకరణాలైన రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషనర్లు, వాషింగ్ మెషీన్లు వంటి ఉత్పత్తులను స్మార్ట్, ఇంధన సమర్థవంతమైన సాంకేతికతతో అందిస్తుంది. ఒక స్మార్ట్ ఫ్యాక్టరీ, ఒక స్మార్ట్ రాష్ట్రం, ఒక స్మార్ట్ దేశం సరికొత్త ప్రయాణం ఈరోజు ప్రారంభమవుతుంది. ఇది కేవలం తయారీ గురించి కాదు... ఇది జీవన భవిష్యత్తును రూపొందించడం గురించి. ఇది ఉద్యోగాలను సృష్టించడం, మన యువతకు సాధికారత కల్పించడం, జీవితాలను మార్చడం గురించి. మేము కేవలం కర్మాగారాలను నిర్మించడం లేదు... మేము రాష్ట్ర భవిష్యత్తును నిర్మిస్తున్నాం. ఎల్‌జీ ప్రధాన యూనిట్ దాదాపు 1,500 ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టిస్తుంది. ఎల్‌జీ ముఖ్య విక్రేతలు అదనంగా రూ. 839 కోట్లు పెట్టుబడి పెట్టడం ద్వారా మరో 690 మందికి పైగా ఉపాధి అవకాశాలను కల్పిస్తారు. ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. ఇది కంపెనీకి ఒక కొత్త ఆవిష్కరణ కంటే ఆంధ్రప్రదేశ్ యువతకు కలల సాకార క్షణం అనొచ్చు. ఎల్‌జీ సప్లయ్ చైన్ ను మరింత బలోపేతం చేయడమేగాక దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించే హైటెక్ యూనిట్. ఎల్‌జీ నాలుగు కీలక విక్రేత భాగస్వాములైన ఎకోరియా, కురోడా ఎలక్ట్రిక్, హేంగ్ సంగ్ ఇండియా, క్యుంగ్‌సంగ్ ప్రెసిషన్ అండ్ టేసంగ్ ఎలక్ట్రానిక్స్ భాగస్వామ్య శక్తి పురోగతికి పాస్‌పోర్ట్ లాంటివి. ఇది వారి ఉమ్మడి సహకార వృద్ధి శక్తిని చాటడమేగాక ప్రపంచ ఎలక్ట్రానిక్స్ తయారీ పర్యావరణ వ్యవస్థగా ఆంధ్రప్రదేశ్ తనను తాను ఎలా నిలబెట్టుకుంటుందో కూడా ప్రపంచానికి చూపిస్తుంది" అని మంత్రి లోకేశ్ తెలిపారు.

## మోదీ పాలన కౌటిల్య నీతికి ప్రతిరూపం
### ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రశంసలు

ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక గొప్ప దార్శనిక నాయకుడని, ఆయన పాలనా విధానం కౌటిల్యుడి తత్వానికి ఆచరణాత్మక రూపమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రశంసించారు. కశ్మీర్‌లోని పుల్వామాలో ఉగ్రవాదులపై భారత్ చేపట్టిన తీవ్ర ప్రతీకార చర్యల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. గురువారం దేశ రాజధానిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ ప్రసంగించారు. "మన ప్రధానమంత్రి కౌటిల్యుడి తత్వాన్ని ఆచరణలో చూపించారు" అని ఆయన అన్నారు. పరిపాలనలోని ప్రతి అంశానికి, రాజనీతి, భద్రత, పాలకుల పాత్ర వంటి విషయాల్లో కౌటిల్యుడి ఆలోచనా విధానం ఒక సమగ్ర గ్రంథం వంటిదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ దార్శనికతను కొనియాడుతూ, "మన ప్రధాని ఒక గొప్ప దార్శనికుడు. ఆయన భారీ స్థాయిలో, విస్తృతమైన పరివర్తనను విశ్వసిస్తారు. దశాబ్దకాల పాలన తర్వాత, ఫలితాలు మన కళ్ల ముందు స్పష్టంగా కనిపిస్తున్నాయి" అని ధన్‌ఖడ్ పేర్కొన్నారు.

భారతదేశం శాంతి కాముక దేశమని, ప్రపంచ శాంతి, సౌభ్రాతృత్వం, ప్రపంచ సంక్షేమాన్ని ఎల్లప్పుడూ విశ్వసిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. మన దేశంపై దాడి చేసిన వారిని మాత్రమే సరిహద్దుల ఆవల లక్ష్యంగా చేసుకున్నామని, హనుమంతుడి సూత్రాలను సాయుధ దళాలు పాటించాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవచ్చు.

భారతదేశపు ప్రాచీన నాగరికత, ప్రజాస్వామ్య విలువల గురించి ధన్‌ఖడ్ మాట్లాడుతూ, "భావప్రకటన, సంవాదం ఒకదానికొకటి పూరకంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. మన రాజ్యాంగం అమల్లోకి రావడంతోనో, స్వాతంత్ర్యం రావడంతోనో మన దేశంలో ప్రజాస్వామ్యం ప్రారంభం కాలేదు. వేల సంవత్సరాలుగా మనం ఆత్మతః ప్రజాస్వామ్య దేశంగా ఉన్నాం" అని వివరించారు. వేద సంస్కృతిలో భావప్రకటన, వాదవివాదాల సమన్వయ విధానాన్ని 'అనంత వాద్' అని పిలిచేవారని ఆయన తెలిపారు. ఈ ఆదర్శాలు, విలువల కారణంగానే 60 ఏళ్ల తర్వాత ఒక ప్రధానమంత్రి మూడోసారి పదవీ బాధ్యతలు చేపట్టే అవకాశం లభించిందని ఆయన అన్నారు.

## 'ఆపరేషన్ సిందూర్ 2.0'...
### లాహోర్ లోని ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్, రాడార్లను ధ్వంసం చేసిన భారత్

ఢిల్లీ: పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు భారత్ మరోసారి గట్టిగా బుద్ధి చెప్పింది. నిన్న రాత్రి భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ జరిపిన దాడులకు సమాధానంగా ఈ ఉదయం భారత సాయుధ దళాలు పాకిస్థాన్‌లోని పలు వ్యూహాత్మక ప్రాంతాల్లో ఉన్న ఎయిర్ డిఫెన్స్ రాడార్లు, వ్యవస్థలపై దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో లాహోర్‌లోని ఓ ముఖ్యమైన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ, రాడార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం పాకిస్థాన్ నుంచి ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. దీనికి కొనసాగింపుగా, నిన్న రాత్రి పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణుల సాయంతో ఉత్తర, పశ్చిమ భారతదేశంలోని పలు సైనిక లక్ష్యాలపై దాడులకు విఫలయత్నం చేసింది. అవంతిపుర, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, అమృత్‌సర్, కపుర్తలా, జలంధర్, లూథియానా, అదంపూర్, భటిండా, చండీగఢ్, నల్, ఫలోడి, ఉత్తర్‌లాయ్, భుజ్ వంటి ప్రాంతాలు ఈ లక్ష్యాలలో ఉన్నాయి. అయితే, భారత ఇంటిగ్రేటెడ్ కౌంటర్ యూఏఎస్ గ్రిడ్, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఈ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాయని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పాకిస్థాన్ జరిపిన దాడులకు సంబంధించిన శకలాలు పలుచోట్ల లభ్యమయ్యాయని, ఇవి పాక్ దుశ్చర్యలకు నిదర్శనమని పేర్కొంది. భారత ప్రభుత్వం విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, "ఈరోజు ఉదయం భారత సాయుధ బలగాలు పాకిస్థాన్‌లోని అనేక ప్రాంతాల్లో ఎయిర్ డిఫెన్స్ రాడార్లు, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి. పాకిస్థాన్ ఏ స్థాయిలో, ఏ పద్ధతిలో స్పందించిందో, అదే స్థాయిలో, అదే పద్ధతిలో భారత్ ప్రతిస్పందించింది. మన దాడులతో లాహోర్‌లోని ఒక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైందని విశ్వసనీయంగా తెలిసింది" అని పేర్కొంది.

## ఆపరేషన్ సిందూర్ మరో విజయం...
### భారత విమానం హైజాక్ సూత్రధారి అబ్దుల్ రవూఫ్ హతం


ఢిల్లీ: భారతదేశ చరిత్రలో అత్యంత దారుణమైన విమాన హైజాక్ ఘటనగా నిలిచిపోయిన ఐసీ-814 కేసులో ప్రధాన సూత్రధారి, జైషే మహమ్మద్ (జెఇఎం) ఉగ్రవాద సంస్థ కమాండర్ అబ్దుల్ రవూఫ్ అజార్ హతమయ్యాడు. 'ఆపరేషన్ సిందూర్' పేరిట భారత సాయుధ బలగాలు అత్యంత చాకచక్యంగా నిర్వహించిన దాడుల్లో అతను మరణించినట్లు అత్యున్నత నిఘా వర్గాలు గురువారం ధృవీకరించాయి. ఈ పరిణామం భారత ఉగ్రవాద నిరోధక చర్యల్లో ఒక కీలక మైలురాయిగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. జైషే మహమ్మద్ చీఫ్ మసూద్ అజార్ తమ్ముడైన అబ్దుల్ రవూఫ్ అజార్, 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఐసీ-814ను కాందహార్‌కు హైజాక్ చేసిన ఘటనలో కీలక పాత్ర పోషించాడు. అప్పటి నుంచి దశాబ్దాలుగా భారత నిఘా సంస్థల రాడార్‌పై ఉన్న ఇతను, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) మోస్ట్ వాంటెడ్ జాబితాలో కూడా ఉన్నాడు. ఇతడిని మట్టుబెట్టడం ద్వారా ఉగ్రవాద సంస్థలకు గట్టి హెచ్చరిక పంపినట్లయిందని అధికార వర్గాలు తెలిపాయి. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని భారత సాయుధ బలగాలు 'ఆపరేషన్ సిందూర్' ను అత్యంత కచ్చితత్వంతో నిర్వహించాయి. ఈ ఆపరేషన్‌లో భాగంగా, జైషే మహమ్మద్‌కు చెందిన అత్యంత కీలకమైన స్థావరంపై జరిపిన దాడిలో అబ్దుల్ రవూఫ్ అజార్ హతమైనట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అతని మరణం పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద నెట్‌వర్క్‌కు, ముఖ్యంగా జైషే మహమ్మద్ సంస్థకు కోలుకోలేని దెబ్బ అని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## రంగంలోకి సౌదీ అరేబియా, ఇరాన్
### భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు..



ఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరిన ప్రస్తుత తరుణంలో, పశ్చిమాసియాలోని కీలక దేశాలైన సౌదీ అరేబియా, ఇరాన్‌కు చెందిన విదేశాంగ మంత్రులు అనూహ్యంగా న్యూఢిల్లీలో పర్యటించారు. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో వీరు వేర్వేరుగా సమావేశమై, నెలకొన్న పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను చల్లార్చే ప్రయత్నాల్లో భాగంగానే ఈ దౌత్యపరమైన చర్చలు జరిగాయని తెలుస్తోంది. సౌదీ అరేబియా విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అదెల్ అల్ జుబైర్ న్యూఢిల్లీకి చేరుకున్నారు. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో ప్రధానంగా ఉగ్రవాద నిర్మూలన అంశంపై భారత వైఖరిని జైశంకర్ స్పష్టంగా వివరించినట్లు ఆయన స్వయంగా 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. "సౌదీ అరేబియా మంత్రి అదెల్ అల్-జుబైర్‌తో సమావేశమయ్యాను. ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో భారత్ దృక్కోణాన్ని ఆయనకు వివరించాను" అని జైశంకర్ తన పోస్టులో పేర్కొన్నారు. సౌదీ మంత్రి పర్యటన ముగిసిన తర్వాత, ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి కూడా జైశంకర్‌తో చర్చలు జరిపారు. భారత్, పాకిస్థాన్ మధ్య సయోధ్య కుదిర్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ ఇప్పటికే పలుమార్లు ప్రకటించిన విషయం విదితమే. "సోదర సమానమైన పొరుగు దేశాలకే మా అత్యున్నత ప్రాధాన్యం" అని అరాఘ్చి ఇటీవల సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, భారత్, పాకిస్థాన్‌లోని తమ దౌత్య కార్యాలయాల ద్వారా ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని తగ్గించడానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాగా, అరాఘ్చి న్యూఢిల్లీకి వచ్చే ముందు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పాకిస్థాన్‌ను కూడా సందర్శించారు. అక్కడి నాయకులతో చర్చలు జరిపిన అనంతరం ఆయన ఇరాన్‌కు తిరిగి వెళ్లి, ఆపై భారతదేశ పర్యటనకు విచ్చేశారు.

### ఆపరేషన్ సిందూర్‌లో
## 100 మంది ఉగ్రవాదులు హతం... రాజ్‌నాథ్ సింగ్



ఢిల్లీ: 'ఆపరేషన్ సిందూర్'లో 100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు కేంద్రం తాజాగా ప్రకటించింది. ఈరోజు ఉదయం కేంద్రం అఖిలపక్ష భేటీ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ భేటీలో ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన వివరాలను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. పాకిస్థాన్, పీఓకేలోని ఉగ్రస్థావరాలపై భారత ఆర్మీ చేపట్టిన దాడుల్లో 100 మంది మరణించినట్లు రాజ్‌రాథ్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ... పాకిస్థాన్, పీఓకేలోని తొమ్మిది ఉగ్రస్థావరాలపై కచ్చితత్వంతో క్షిపణి దాడులను నిర్వహించాం. ఈ దాడుల్లో 100 మంది ముష్కరులను మట్టుబెట్టాం. దీనికి సంబంధించిన మరింత సమాచారం కోసం ఎదురుచూస్తున్నాం. ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నందున ఈ ఆపరేషన్ తాలూకు పూర్తి సమాచారాన్ని ఇప్పుడే వెల్లడించలేం. ఈ ఉద్రిక్తతలను పెంచాలనే ఉద్దేశం మాకు లేదు. కానీ, దాయాది పాక్ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే మాత్రం... వెనక్కి తగ్గేదిలేదు. దీటుగా బదులిస్తాం. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుంది అని అన్నారు.

దేశం కోసం కేంద్రం తీసుకునే చర్యలకు పూర్తి మద్దతు: రాహుల్ గాంధీ

అఖిల పక్ష భేటీలో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మాట్లాడుతూ... దేశం కోసం కేంద్రం తీసుకునే చర్యలకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్‌పై ప్రతిపక్షాలు ఐక్యంగా నిలిచి ప్రభుత్వానికి అండగా ఉంటాయన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతుందని మంత్రి రాజ్‌నాథ్ చెప్పినట్లు రాహుల్ గాంధీ వెల్లడించారు.

ప్రతిపక్షాలు అత్యంత పరిణితితో వ్యవహరించాయి: కిరణ్ రిజిజు

ఆపరేషన్ సిందూర్‌పై అఖిల పక్ష సమావేశం తర్వాత కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడారు. "ఆపరేషన్ సిందూర్ వివరాలను, ప్రభుత్వ ఉద్దేశాలను రక్షణమంత్రి ప్రతిపక్ష నేతలకు వివరించారు. ప్రస్తుతం ఇంకా ఆపరేషన్ కొనసాగుతోంది కనుక సాంకేతిక వివరాలను ఆయన వెల్లడించలేకపోయారు. ప్రతిపక్షాలు అత్యంత పరిణితితో వ్యవహరించాయి. ప్రభుత్వానికి పూర్తి మద్దతు ప్రకటించాయి. ఈ అంశంలో రాజకీయాలకు తావులేదు" అని కిరణ్ రిజిజు తెలిపారు. కాగా, ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పర్యాటకులపై దాడికి పాల్పడి 26 మంది అమాయకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులపై భారత్ బుధవారం ప్రతీకారం తీర్చుకున్న విషయం తెలిసిందే. ఆ ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై బుధవారం తెల్లవారుజామున తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ప్రతిదాడికి దిగి పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)తో పాటు పాకిస్థాన్‌లోని మూడు ప్రధాన ఉగ్రవాద సంస్థలు జైషే మహ్మద్, లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌లకు చెందిన తొమ్మిది ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేసింది. ఈ దాడితో జైషే చీఫ్ మసూద్ అజార్ కుటుంబంలోని 10 మంది ప్రాణాలు కోల్పోయారు.

## ఆపరేషన్ సిందూర్‌కు సెల్యూట్..



కోదాడ: ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ సైన్యం చేస్తున్న పోరాటం అనన్యసామాన్యమైనదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భారత ప్రభుత్వం, దేశ ప్రజల లక్ష్యసాధన కోసం త్రివిధ దళాలు పాకిస్థాన్‌లో, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో శత్రుసేనలకు చెందిన తొమ్మిది స్థావరాలపై చేసిన దాడులు విజయవంతం కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కోదాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రేరేపిత తీవ్రవాదాన్ని తుదముట్టించే ప్రక్రియలో త్రివిధ దళాలు చూపిన ధైర్య సాహసాలను చూసి దేశం గర్విస్తున్నదని కొనియాడారు. భారత వైమానికదళంలో పనిచేసిన అనుభవం తనకుందని, అందులో యుద్ధ విమానాల పైలట్‌గా యుద్ధ సమయంలో పనిచేసిన అనుభవాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆ అనుభవంతో చెబుతున్నా పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని అణిచివేసేందుకుగాను త్రివిధ దళాలు సమర్థవంతంగా, ఎంతో చాక చక్యంగా శత్రు శిబిరాలపై దాడులు జరిపి దాయాది దేశానికి సరైన గుణపాఠం నేర్పారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఐజి పిలుపునిచ్చారు. గురువారం అమరచింత మండలం పరిధిలోని పామిరెడ్డి పల్లె గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.అజయ్ మండల అధ్యక్షులు కె. శంకర్ లు మాట్లాడుతూ. పని ప్రదేశంలో ప్రతి కూలికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించాలని డిమాండ్ చేశారు. టెంట్లు గడ్డపార తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఉపాధిలో రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని. ఏడాదికి 200 పని దినాలను కల్పించాలని. ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం ఏటా 2 లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధిని నిర్వీర్యం చేయడంలో భాగంగా అనేక పనులను తగ్గించారని. తద్వారా లక్షలాది పని దినాలను కూలీలు కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజు కూలి కేవలం 307 రూపాయలు ఏమాత్రం సరిపోవని కొలతల పద్ధతిని రద్దుచేసి రోజు కూలి కనీసం 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారం వారం చేసిన పనులకు గాను పేస్లిప్పులు ఇవ్వాలని కోరారు. ఉపాధి సమస్యల పరిష్కారం కొరకు జరుగు 20న సమ్మె లో ఉపాధికూలీలు పాల్గొని సమ్మె ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు . ఈ కార్యక్రమంలో చంద్రమ్మ అనంతమ్మ అలివేలమోహన్ గోవిందు. అహ్మద్ మియా పెంటన్న గోపి రఘు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు డివిశంకర్రావును అభినందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.




ఎటపాక ( జనం రిపోర్టర్ ) : భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ రామిరెడ్డి.లి భద్రాచలంలో రెవెన్యూ శాఖ మంత్రి వివిధ ప్రారంభోత్సవ కార్యక్రమాలకు విచ్చేసిన సందర్భంలో భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు డివి శంకర్రావు గారిని అభినందించి ఘనంగా సన్మానించడం జరిగింది. హైదరాబాదులోని మేడ్చల్ లో 3,4 తారీకులలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో, భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ లో పవర్ లిఫ్టింగ్ ప్రాక్టీస్ చేస్తున్న రిటైర్డ్ ఎస్బిఐ మేనేజర్ డివి శంకర్రావు గారు బంగారు పతకం సాధించడం జరిగింది.పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ట్రేజరర్ మహంతి వెంకటకృష్ణాజి రజిత పతకం ను సాధించడం జరిగింది. ఈ విషయాన్ని ఈరోజు పొంగులేటి పర్యటనలో ఉన్న సమయంలో స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి తెలియపరిచిన సందర్భంలో అసోసియేషన్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు భోగాల శ్రీనివాస్ రెడ్డి ద్వారా వారిని పిలిచి అభినందించి ఘనంగా సత్కరించడం జరిగింది ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డివి శంకర్రావు కి 73 సంవత్సరాల వయసులో బైపాస్ సర్జరీ అయినా కూడా పట్టుదల కార్యదీక్షతో పవర్ లిఫ్టింగ్ లో మూడు నెలల సమయంలోనే ఓనమాలు తో ప్రారంభించి ఖమ్మంలో జరిగిన రెండు జిల్లాల స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలలో బంగారు పతకము , మరియు మూడు నాలుగు తారీకులలో హైదరాబాద్ మేడ్చల్ లో జరిగిన తెలంగాణ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీలలో కూడా బంగారు పతకం సాధించడం జరిగింది. అతి తక్కువ కాలంలోనే ఇంతటి విజయానికి కారణమైన, భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ జివి రామిరెడ్డిని, మరియు అసోసియేషన్ సభ్యులైన, డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, మహంతి వెంకటకృష్ణాజి, గూగులోతు శోభ నాయక్ లను కూడా ఈ సందర్భంగా అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు భోగాల శ్రీనివాసరెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ జివి రామిరెడ్డి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్ , మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవిడర్

### /కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె




గుంటూరు ( జనం రిపోర్టర్ ) : 11వ రోజు గుంటూరు జిల్లా కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా నిర్వహించారు.ఈ సందర్భంగా గుంటూరు జిల్లా జనరల్ సెక్రటరీ పల్లపాటి లింగరాజు, కమ్యూనిటీ హెల్త్ఆఫీసర్ కె నాగజ్యోతి, వైస్ ప్రెసిడెంట్ జి వనజ మాట్లాడుతూ...ఆయుష్మాన్ భారత్ నిబంధన ప్రకారం ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సిహెచ్ఓలను రెగ్యులర్ చేయాలని, డి. కరుణ, డిమాండ్ చేశారు.ఎన్ హెచ్ యం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని కోరారు.పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఈ పి ఎఫ్ ఓ పునరుద్ధించాలని అన్నారు.క్లినిక్ అద్దె బకాయలను వెంటనే చెల్లించి క్రమబద్ధీకరించాలని కోరారు.నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలని, ఆర్ఎస్ నుండి సి హెచ్ ఓ లకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు.మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తానే ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో కొడాలి సృజన, డి కరుణజ్యోష్న, అనిత,అబ్దుస్, డి ప్రవళిక, మరియు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## భారత సైన్యానికి సెల్యూట్..

### ఆపరేషన్ సింధూర విజయం... పాకిస్తానుకు కోలుకోని దెబ్బ

**శివసేన( ఉద్దవ్ బాలా సాహెబ్ దాఖరే ) పార్టీ ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్ బాబు**



విశాఖపట్నం ( జనం రిపోర్టర్ ) : పహాల్గంలో పాకిస్తాన్ ఉగ్రమూకలు చేసిన దాష్టికానికి ప్రతీకగా భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధూర పేరిట నిర్వహించిన ఆపరేషన్ భారత్ సత్తాను పాకిస్తానికి రుచి చూపించిందన్నారు. ఉగ్ర మూకలను ఏరి పారేయడంలో భారత సైన్యం ప్రదర్శించిన ధైర్య [illegible] అజరామరం. ఉగ్ర దాడులకు పాల్పడిన, వారికి సహకరించిన దేశాలకు ప్రధానంగా పాకిస్తాన్ కు ఇదొక హెచ్చరిక లాంటిదని శివసేన ( ఉద్దవ్ బాలా సాహెబ్ దాఖరే ) పార్టీ ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్ బాబు అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ కను సన్నలలో నిర్వహించిన ఆపరేషన్ సింధూరలో పాల్గొన్న ప్రతి భారతీయ సైనికుడికి పార్టీ తరఫున చేస్తున్నామని తెలియజేశారు. ఉగ్రదాడిని నిరోధించడానికి భారత ప్రభుత్వానికి శివసేన( ఉద్ధవ్ బాలా సాహెబ్ దాకరే ) ఎప్పుడూ అండగా ఉంటుందని ఓ ప్రకటనలో తెలియజేశారు.

## రైతు కూలీల బతుకులతో ఆటలాడుకుంటున్న పాలకవర్గాలపై ఉద్యమించండి నేదునూరి రాజమౌళి



హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : హసన్ పర్తి : దేశ వ్యవసాయ రంగాన్ని సమీక్షించి సుస్థిర అభివృద్ధి కొరకు సాగు భూమిని భూమిలేని నిరుపేద దళిత బహుజనులకి పంపిణీ చేయాలని ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర నాయకులు నేదునూరి రాజమౌళి పాలకవర్గాలని డిమాండ్ చేశారు. గురువారం హసన్ పర్తి మండలం జయగిరి గ్రామంలో శాఖ సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ నేషనల్ కమిషన్ ఫర్ ఫార్మర్స్ పేరుతో రైతులకు కనీస మద్దతు ధర పంట పండించడానికి అయినా మొత్తం ఉత్పత్తి ఖర్చు వ్యయానికి 50 శాతం లాభం మార్జిన్ కలిపి ఇవ్వాలని 2004లో సూచించినప్పటికీ ఇప్పటికీ ఇవ్వకపోవడం ద్వారా రైతులు, వారిపై ఆధారపడిన వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతు సంక్షేమం కోసం పెట్టుబడి డబ్బులు, కరెంటు సబ్సిడీ, విత్తనాలు అందచేయడం ద్వారా ఆహార ఉత్పత్తులు పెరిగి వ్యవసాయ రంగం అభివృద్ధి చెంది దేశం వృద్ధి చెందుతుందన్నారు. వ్యవసాయ రంగం మీద ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు పెరగాలన్నారు. మౌలిక సదుపాయాలను రైతుకు అందుబాటులో తేవాలి బేషరత్తుగా రైతు రుణాలు మాఫీ చేయాలి అని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 26,27 తేదీలలో హసన్పర్తి మండల కేంద్రంలో జరుగు హనుమకొండ జిల్లా సిపిఐ మహాసభలను అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జయగిరి గ్రామ నూతన శాఖ ఎన్నుకొనడం జరిగింది. శాఖ కార్యదర్శిగా గడ్డం చంద్రమౌళి, సహాయ కార్యదర్శిలుగా నన్నే బోయిన జంపయ్య, పిట్టల రవి లను ఎన్ను కొనడం జరిగింది. రేణిగుంట్ల ఎల్ల స్వామి రేణిగుంట్ల సాంబయ్య, రేణిగుంట్ల సంజీవ, గొర్రె ప్రభాకర్, రేణిగుంట్ల కమలాకర్, అశోక్, దండ బోయిన రవీందర్, ఆర్ కిష్టయ్య, యాటకాయల కుమారస్వామి, విజయ తదితరులు పాల్గొన్నారు.

## అఖండ జ్యోతిని దర్శించుకున్న కొత్తపల్లి.

### అమ్మవారి అఖండ జ్యోతిని దర్శించుకుంటున్న కాపు కార్పోరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు.



మొగల్తూరు, మే8జనం రిపోర్టర్: మూడు సంవత్సరాలకు ఒక సారి నిర్వహించే ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా బుధవారం రాత్రి అఖండ జ్యోతిని వెలిగించారు. జాతర సాంప్రదాయం ప్రకారం ఈ అఖండ జ్యోతిని గ్రామానికి చెందిన కరణం కుటుంబీకులు చెన్నాప్రగడ వంశస్థులు బుధవారం రాత్రి 12 గంటలకు వెలిగించారు. అనంతరం అమ్మవారి అఖండ జ్యోతిని ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నెలకొల్పిన పూరి పాకలో ఉంచారు. గురువారం రాత్రి నుండి వచ్చే నెల 7వ తేది వరకూ ఆలయ పరిధి గ్రామాల్లో ఈఅఖండ జ్యోతిని ఇంటింటికి తిప్పుతారు. గురువారం రాష్ట్ర కాపు కార్పోరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు ఆలయ కమిటీ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, దొంగ స్వామి తదితరులు అఖండ జ్యోతిని దర్శించుకుని అమ్మవారికి పూజలు చేశారు.

## విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

### పదవ తరగతిలో 577/600 మార్కులు సాధించిన

### శ్రీవాణి హై స్కూల్ విద్యార్థిని పి.పూజను అభినందించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి




ఆత్మకూరు /వనపర్తి జిల్లా ప్రతినిధి/ ( జనం రిపోర్టర్ ) : విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షల్లో ఆత్మకూరు శ్రీవాణి హై స్కూల్ విద్యార్థిని పూజ 577/600 మార్కులు సాధించి టాపర్ గా నిలిచింది. ఈ నేపథ్యంలో గురువారం జిల్లా కలెక్టర్ తన కార్యాలయంలో కలెక్టర్ విద్యార్థినికి అభినందనలు తెలిపారు.విద్యార్థి కృషికి సహకరించిన పాఠశాల చైర్మన్,ప్రిన్సిపల్ ఉపాధ్యాయులను,తల్లిదండ్రులను కలెక్టర్ అభినందించారు.పదవ తరగతి ఫలితాలలో జిల్లా ఉత్తమ మార్కులు సాధించిన సాధించినందుకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఐ.ఏ.ఎస్ జిల్లా కలెక్టర్ మేజిస్ట్రేట్ చేతుల మీదుగా విద్యార్థినీ సన్మానించి అభినందిస్తూ బహుమతినీ అందించారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి విద్యార్థికి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీవాణి హై స్కూల్ ఆత్మకూర్ పాఠశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎన్నికల వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలి.

### ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కండి.యం.

### బాల నరసింహ,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు.




ఆత్మకూర్ వనపర్తి జిల్లా ప్రతినిది ( జనం రిపోర్టర్ ) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు యం.బాల్ నరసింహ డిమాండ్ చేశారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలోని వర్తక సంఘం భవనంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వనపర్తి జిల్లా సమితి సమావేశం కామ్రేడ్ మోష అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎం.బాల నరసింహ మాట్లాడుతూ:- పాకిస్తాన్లో ఉన్నటువంటిఉగ్రవాదులను అంతమొందిచే విధంగా కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వచర్యలను భారత కమ్యూనిస్టు పార్టీ స్వాగతిస్తుంది కానీ ఇరుదేశాల పౌరులకు ఎలాంటి హాని కలగకుండా చూడాల్సిన బాధ్యత ఇరు దేశాల ప్రభుత్వాలకు ఉందని అన్నారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత వేగంగా ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నారని మండిపడ్డారు. మోడీ పాలనలో సామాన్య ప్రజలు జీవించలేని స్థితి నెలకొన్నదని ఆరోపించారు. చీటికిమాటికి పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ లాంటి నిత్యవసర వస్తువుల ధరలు పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత కెసిఆర్ ప్రభుత్వం మాదిరిగా మాటలతో కాలం వెళ్లదీయకుండా ఆరు గ్యారంటీల హామీల అమలకు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ భరత గడ్డపై ఆవిర్భవించి 100 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా గ్రామ గ్రామాల్లో సిపిఐ రాజీలేని పోరాటాలను, వీరోచిత త్యాగాల ఘట్టాలను పార్టీ శ్రేణులకు ప్రజలకు వివరిస్తూ గ్రామస్థాయి నుండి పార్టీ ప్రజాసంఘాల పెంపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఐ శ్రేణులు పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కే.విజయ రాములు, సిపిఐ జిల్లా నాయకులు జే.చంద్రయ్య,మోష, శ్రీహరి, అబ్రహం,సి.నరసింహ శెట్టి, జీ.రమేష్, గోపాలకృష్ణ, కురుమయ్య,రవీందర్, మాషప్ప, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.డి కుతుబ్, మహేష్,బాలరాజ్,భరత్, ఏఐటీయూసీ రాష్ట్ర నేత పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## జులాయి గా తిరుగుతూ, అసాంఘిక,

### చట్ట వ్యతిరేక పనులు చేస్తున్న వ్యక్తులే లక్ష్యంగా “"ఆపరేషన్ చబుత్రా"”...

**గోదావరిఖని 1 టౌన్ పోలీసుల అధ్వర్యం లో అర్ధరాత్రి ముమ్మర తనిఖీలు.....**



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 08. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి జిల్లా గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ కర్ణాకర్ ఆదేశాల మేరకు గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ పర్యవేక్షణ లో ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఆపరేషన్ చబుత్రా ను నిర్వహించారు. పోలీస్ అధికారులు సిబ్బంది తో కలిసి బైక్ పై పెట్రోలింగ్ చేస్తూ, రాత్రి వేళల్లో ప్రధాన కూడళ్లు, వీధులు, రోడ్ల పై గుంపులుగా జులాయిగా తిరుగుతూ ప్రజలను ఇబ్బందిలకు గురిచేస్తూ, మద్యం సేవించి రోడ్లపై ద్విచక్ర వాహనాలతో తిరుగుతున్న



యువకులను, అనుమానస్పదంగా తిరుగుతున్న వారిని ఉన్న 60 మంది యువకులను, 29 బైక్ లు, 01, కారు అదుపులోకి తీసుకోవడం జరిగింది. పట్టుబడిన వారికీ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరిగింది, పట్టుబడిన వారిపై ఇ - పెట్టి కేసు నమోదు చేసి, కౌన్సిలింగ్ నిర్వహించి భవిష్యత్తు మరల పట్టుబడినచో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి మాట్లాడుతూ..ఆ కారణంగా ఎలాంటి పని లేకుండా అవసరమైతే తప్ప అర్ధరాత్రి దాటిన తర్వాత ఎవరు కూడా వీధుల్లో తిరిగరాదని తెలిపినారు.రాత్రి 10 గంటల తర్వాత ఎవరైనా యువకులు రోడ్లపై విన్యాసాలు చేస్తూ, గుంపులుగా కనబడితే వారిని అరెస్ట్ చేసి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండి రాత్రి వేళలో ఆ కారణంగా బయటికి వెళ్లకుండా చూడాలని తెలపడం జరిగింది.యువత ఏలాంటి చెడు మార్గాలకు వెళ్లకుండా తమ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి రాత్రి పూట బయట తిరుగుతూ ప్రమాదాలకు గురికావడం జరుగుతుంది.ఆపరేషన్ చభుత్ర లో పట్టుబడిన వారి యొక్క వెహికల్స్ ను స్వాధీనం చేసుకొని వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి తెలిపారు. ఈ యొక్క ఆపరేషన్ చభుత్ర లో గోదావరిఖని వన్ టౌన్ ఎస్ఐ రమేష్, శ్రీనివాస్, భూమేష్, కోటేశ్వర్ లు, పోలీస్ స్టేషన్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## తూర్పు కాపులకు ఓబిసి ధ్రువపత్రాలు ఇవ్వాలి

### తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ మూది నారాయణ స్వామి.



ఏలేశ్వరం, ( జనం రిపోర్టర్ ) : తూర్పు కాపులకు ఓ బి సి ధ్రువపత్రాలు ఇవ్వకపోవడం వలన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో,విద్యా ప్రవేశాలలో తీరని అన్యాయం జరుగుతుందని తూర్పు కాపులకు ఓబీసీ ధ్రువపత్రాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ మూది నారాయణ స్వామి అన్నారు. బుధవారం నాడు విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తూర్పు కాపు సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ పాలవలస యశస్విని ఆధ్వర్యంలో జరిగిన బోర్డు మీటింగ్లో పాల్గొనడం జరిగిందని నారాయణస్వామి తెలిపారు.ఈ మీటింగ్ లో ముందుగా కాశ్మీర్లో పెహల్గాం ఉగ్ర దాడిలో మరణించిన వారికి అలాగే మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించడం జరిగిందని ఆయన తెలిపారు.అనంతరం తూర్పు కాపు సామాజిక వర్గం బలోపేతానికి మరియు ఓబీసీ సాధన కొరకు డైరెక్టర్లతో చర్చించి,సలహాలు తీసుకున్నారని తెలిపారు.త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లను కలిసి తూర్పు కాపు కమ్యూనిటీ హాలులు నిర్మాణానికి నిధులు,ఓ.బి.సి సాధన వంటి అంశాలపై విన్నవించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ జే.ఎం.డి ఉమాదేవి,సిబ్బంది పాల్గొన్నారని ఆయన తెలిపారు.

## ఎడిటర్ ధనుంజయరెడ్డి అరెస్టు అప్రజాస్వామికం



ఏలేశ్వరం ( జనం రిపోర్టర్ ) : సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఏలేశ్వరం ప్రెస్ క్లబ్ సభ్యులు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి అరెస్టును ఖండిస్తూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వార్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కుశరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సొర్నంపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటికి ఏపీ పోలీసులు వెళ్లి భయానక వాతావరణాన్ని సృష్టించి అరెస్టు చేయడం దారుణమని అన్నారు. పోలీసుల తీరుకు ధనుంజయ రెడ్డి కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారన్నారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఆయనను పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ ఈ తరహాలో అరెస్టులు చేయడం సరికాదన్నారు. తక్షణమే ధనుంజయరెడ్డిని విడుదల చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు కోరాడ శ్రీనివాసరావు, శిడగం మాధవ్, దొంతంశెట్టి సతీష్, అడపా దుర్గారావు, చిలికోటి సుధీర్, తొగర సూరిబాబు, పారేపల్లి గంగా ప్రసాద్, షేక్ ఇమ్రాన్, గ్రంధి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## : పట్టణ అధ్యక్షునిగా కొట్టె చంద్రయ్య



చొప్పదండి, ( జనం రిపోర్టర్ ) : తెలంగాణ రాష్ట్ర మస్నురుకాపు సంఘం ఆదేశాల మేరకు గురువారం రోజున సంఘ%శీ% నాయకులు మడ్లపెల్లి శ్రీనివాస్,పులుకం గంగన్న ఆధ్వర్యంలో చొప్పదండి పట్టణ మరియు మండల మున్నూరు కాపు సంఘం కమిటీలు ఎన్నుకోవడం జరిగింది.మున్నూరు కాపు సంఘం పట్టణ అధ్యక్షునిగా కొట్టే చంద్రయ్య ఏకగ్రీవంగా నియమించబడ్డారు. గౌరవ అధ్యక్షులుగా కొట్టే అశోక్,మునిగల రాజేందర్, ఉపాధ్యక్షుడిగా ఉశికమల్ల కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా మరిమడ్ల అంజి, సంయుక్త కార్యదర్శిగా వరాల తిరుపతి, కోశాధికారి సైన్ల రవి,సభ్యులు మరిమడ్ల సతీష్, తులా మునిందర్, వరాల నర్సయ్య, మరిమడ్ల గౌరీ, మహిపాల్, గోపిశెట్టి స్వామి లు నియమించబడ్డారు. అధ్యక్షుడు కొట్టె చంద్రయ్య మాట్లాడుతూ.. నా నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అలాగే సంఘం బలోపేతానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల మున్నురుకాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# 10వ తేదీన రాష్ట్ర స్థాయి
# పంచాయతీ కార్యదర్శుల సదస్సు
## తెలంగాణ రాష్ట్ర చీఫ్ వి పట్నం మహేందర్ రెడ్డి ని కలిసిన వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రవి శెట్టి, ప్రధాన కార్యదర్శి సంజీవ్ కుమార్..!!

**పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెస్తాం పట్నం మహేందర్ రెడ్డి..!!**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : ఉమ్మడి రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల సదస్సు ఈనెల 10వ తేదీన రాష్ట్ర తదస్సుకు తెలంగాణ రాష్ట్ర చీప్ విప్ పట్నం మహేందర్ రెడ్డి హాజరవుతున్నారని ఈ సమావేశానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు అందరూ కావాలని వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రవిశెట్టి ప్రధాన కార్యదర్శి సంజు కుమార్ గురువారం మాట్లాడుతూగ్రామీణ ప్రాంతాల్లో పరిపాలనకు ప్రజలకు ఎంతో సేవలుఅందిస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శుల సమస్యల ను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తామని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు.తెలంగాణ గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ అధ్యక్షుడు ఏ శ్రీకాంత్ గౌడ్ ప్రధాన కార్యదర్శి నాగరాజు గౌరవ అధ్యక్షుడు సందీప్ తదితరులు గురువారం ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ని కలిసి తమ సమస్యలను వివరించారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న నిర్వహించే రాష్ట్ర స్థాయి పంచాయతీ కార్యదర్శుల సదస్సుకు రావాల్సిందిగా ఆయన ను ఆహ్వానించారు. గతంలో వికారాబాద్ రంగారెడ్డి మేడ్చల్ జిల్లాలలో పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ కోసం మంత్రిగా మహేందర్ రెడ్డి సహకరించిన విషయాన్నీ గుర్తు చేస్తూ ప్రస్తుతం తమకున్న సమస్యలను ప్రభుత్వానికి వివరించేందుకు మరో మారు సహకరించాలని వారు మహేందర్ రెడ్డిని కోరారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నాలుగు సంవత్సరాల కాలం పూర్తి చేసుకొని గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శి గా క్రమ బద్ధీకరించ బడిన వారి సర్వీస్ లో ఏడాది సేవా కాలం పూర్తి అయినందున ప్రభావిత తేదీని ప్రకటిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయాలని అందుకు మంత్రి సీతక్క, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకి వివరించాలని వారు మహేందర్ రెడ్డి ని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లేని గ్రామ పంచాయతీలకు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించి, సామాజిక తనిఖీల్లో పంచాయతీ కార్యదర్శులకు బాధ్యులు చేయరాదని వారు కోరారు. క్రీడా కోటాలో ఎంపికైన 98 మంది జిపిఎస్ లను తొలగించిన నేపథ్యంలో వారిని సర్వీసులోకీ తీసుకొని క్రమబద్ధీకరణ చేయాలని సంఘం నేతలు డిమాండ్ చేశారు. వారి సమస్యలను విన్న మహేందర్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకు వస్తానని వివరించారు. ప్రభుత్వ సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డి, మంత్రి సీతక్కతో చర్చిస్తామని సమస్యను డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, సీఎం రేవంత్ రెడ్డి ల దృష్టికి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులు సేవలను ఆయన కొనియాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి,ఫలాలను ప్రజలకు, నిరుపేదలకు, రైతులకు, యువతకు, మహిళలకు అందేలా చూడాలని ఆయన వారికి సూచించారు. పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రవిశెట్టి, ప్రధాన కార్యదర్శి సంజీవ కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేందర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పోతులయ్య మృతి పార్టీకి తీరని లోటు



నార్పల: ( జనం రిపోర్టర్ ) : మండల కేంద్ర పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పోతలయ్య అనారోగ్య కారణంగా గురువారం మరణించారు. ఈ విషయం తెలిసిన వెంటనే నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మరియు మండల టీడీపీ నాయకులు ఆకుల విజయకుమార్ బాబు పోతులయ్య భౌతికకాయానికి పూల మాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఎమ్మెల్యే పోతులయ్య కుటుంబ సభ్యులను ఓదారుస్తూ అన్ని విధాలుగా మీ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోతులయ్య సేవలు మరువలేనివి పోతలయ్య ఆకుల కుటుంబానికి చేసిన సేవలు మరవరానివని విజయ్ కుమార్ బాబు ఎంతో దిగ్భ్రాంతికి లోనయ్యారు.



అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని తెలిపారు. పోతులయ్య కుటుంబ సభ్యులను మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆకుల ఆంజనేయులు, ఆకుల ప్రసాద్,ఆకుల విజయ్ కుమార్ బాబు తదితరులు పరామర్శించారు.

# మాదిగ జర్నలిస్టులు ఐక్యత చాటాలి



హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : మాదిగ జర్నలిస్టు ఫోరం హసన్ పర్తి మండల అధ్యక్షులు సందెల రాజు మాదిగ ఆధ్వర్యంలో గురువారం మాదిగ జర్నలిస్టుల అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఆరెపల్లి పవన్ మాదిగ హాజరై మాట్లాడుతు... మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల పోరాటం ఫలితంగా ఎస్సీ ల వర్గీకరణ సాధించడం జరిగింది. సాధించిన వర్గీకరణ మాదిగ మాదిగ ఉప కులాలు త్వరలోనే ప్రభుత్వం ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్ రాబోతుంది వారిని చైతన్య పరిచే బాధ్యత మీపై ఉందని అన్నారు. అదే విధంగా మండల అధ్యక్షుడు సందెల రాజు మాట్లాడుతూ మాదిగ జర్నలిస్టుల హక్కుల సాధన కొరకు పోరాడుతామని మాదిగ జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మాదిగ జర్నలిస్టులకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందించి వారి అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు మాదిగ జర్నలిస్టులకు అందే విధంగా కృషి చేయాలని జర్నలిస్టుల పై దాడులు చేసే దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం జె ఎఫ్ గౌరవ అధ్యక్షులు రాజారావు బిక్షపతి, సింగారపు బాబు ప్రధాన కార్యదర్శి రామంచ మధుకర్, సహాయ కార్యదర్శి కోడేపాక శ్రీకాంత్, ఎర్ర కుమార్, గరిగే శ్రీను దేవు, సందెల కిషోర్, బొక్క రాజు, జన్ను అభిషేక్, పోగుల రాజ్ కుమార్ రేణిగుంట్ల దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీవో



నార్పల ( జనం రిపోర్టర్ ) : జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని నడిమిదొడ్డి, కేశేపల్లి సచివాలయాలను, నార్పల మేజర్ పంచాయితీ కార్యాలయాన్ని గురువారం ఇంచార్జ్ ఎంపీడీవో భాస్కర్ ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. తనిఖీలలో భాగంగా పలు రికార్డులను పరిశీలించారు. గ్రామ సచివాలయాలలో మరియు పంచాయతీలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది కి సంబంధించిన అటెండెన్స్ ని, మూవ్ మెంట్ రిజిస్టర్ ని క్షుణ్ణంగా పరిశీలించారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించాలని, విధినిర్వహణలో కార్యాలయాన్ని విడిచి వెళ్లే సందర్భంలో తప్పకుండా మూమెంట్ రిజిస్టర్ లో



నమోదు చేయాలని సచివాలయాల సెక్రటరీలకు మరియు మేజర్ పంచాయతీ కార్యదర్శి కి సూచించారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఎవరిని ఉపేక్షించేది ఉండదని ఎంపీడీవో తెలిపారు. మండలంలో విలేఖరుల కార్యాలయం నిర్మించాలి మండలంలో పడిందా పని చేస్తున్న విలేఖరులందరికీ ఒక కార్యాలయంను తొందరలోనే కేటాయించేలా కృషి చేస్తానని ఎంపీడీవో భాస్కర్ విలేఖరులకు తెలిపారు. అందులో భాగంగా మేజర్ పంచాయతీ సర్పంచ్ తో మరియు పంచాయతీ కార్యదర్శి తో నిరుపయోగంలో ఉన్న రూములను పరిశీలించి పాత్రికేయులకు విలేకరుల కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

# "ఆపరేషన్ సిందూర్"
## నేపథ్యంలో భద్రత ఏర్పాట్ల పై సమీక్షా సమావేశం...

అన్ని శాఖల సమన్వయంతో యంత్రాంగం

అప్రమత్తంగా ఉండాలి...-పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా...




రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 08. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ అధ్యక్షతన, రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా పరిధిలోని సింగరేణి, ఏన్టీపీసీ, ఆర్ ఎఫ్ సి ఎల్, ప్రధానమైన ఇండస్ట్రియల్ సంస్థల అధికారులు, భద్రతాధికారులు, రామగుండం కమిషనరేట్ పరిధిలోని డిసిపిలు, ఏసిపిలతో భద్రతా పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించారు." ఆపరేషన్ సిందూర్ "నేపథ్యంలో ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించడంతోపాటు ప్రధాన మైన సంస్థల ప్రాంతాల్లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ రక్షణ వ్యవస్థ, భద్రతా వ్యవస్థను కట్టదిట్టం చేయాలని అధికారులకు పోలీస్ కమీషనర్ ఆదేశించారు.రామగుండం కమీషనరేట్ ప్రాంత రక్షణ పరంగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ, అన్ని శాఖల యంత్రాంగం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఇండస్ట్రీయల్ సంస్థల వద్ద భద్రతను పెంచాలి. అత్యవసర సర్వీసులు అందించే విభాగాల ఉద్యోగులు, అన్ని శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసి, నిరంతర నిఘా, పర్యవేక్షణ చేపట్టాలని సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెంటనే అమలు చేయడానికి చర్యలు అన్ని భద్రత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, కమీషనరేట్ పరిధిలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి భాస్కర్ , పెద్దపెల్లి డిసిపి కర్ణాకర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు, సుధేష్ జంకర్ సి ఐ ఎస్ ఏ,ఎ సి, సర్వర్ సిఐఎస్ఎఫ్ కమాండెంట్, ఎస్.ఎ. రాజు, డిప్యూటీ. కమాండెంట్, ఎన్ టి పి సి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమత , లలిత్ కుమార్ ఆర్ జి వన్ జీఎం, రాముడు జిఎం. ఆర్ జి -2, ఎం సుదర్శన్ రావు ఆర్ జి త్రీ జి ఎం, ఎం శ్రీనివాస్ జి ఎం శ్రీరాంపూర్, ఉదయ్ ఆర్ ఎఫ్ సి ఎల్ సి జి ఎం., సోమనాథ్ సంక డిజిఎం హెచ్ఆర్ ఎన్ టి పి సి, భగవాన్ రెడ్డి మంచిర్యాల్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, అనిల్ కుమార్ పెద్దపల్లి డిస్టిక్ ఫైర్ ఆఫీసర్,బి. రాంబాబు ఏ ఈ ఈ పార్వతీ పంప్ హౌస్, రాకేష్ రెడ్డి, హెచ్పిసిఎల్ , రామగుండం, రవి రాజ్ ఐఓసీఎల్ రామగుండం, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసిపిఎం రమేష్ మంచిర్యాల ఐఎఫ్ఎస్సి జైపూర్ ఏసిపి ఆర్ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసిపి రవికుమార్, సిఐఎస్ఎఫ్ , సి ఆర్ పి ఎఫ్ అధికారులు, సింగరేణి ఎన్ టి పి సి, ఆర్ ఎఫ్ సి ఎల్, తదితర సంస్థల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధం నేపద్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



రేపల్లె. ( జనం రిపోర్టర్ ) : భారత్..పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో ప్రజలు తీసుకోవలసిన ప్రాణ రక్షణ చర్యలపై మాక్డ్రిల్ నిర్వహించినట్లు ప్రభుత్వ వైద్యశాల సూపర్ అటెండెంట్ సుధాకర్ తెలిపారు. గురువారం ప్రభుత్వ వైద్యశాలలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధ పరిస్థితి ఏర్పడితే, సాధారణ ప్రజలు తమ భద్రత కోసం పలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. యుద్ధ సమయంలో వైద్య పరంగా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు ఎంతో కీలకమైనని చెప్పారు. ప్రజల ఆరోగ్యంపై తక్షణ ప్రభావాలు లేకపోయినా, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సౌకర్యాలు అందుబాటులో లేకపోవచ్చని, కొన్ని ముఖ్యమైన వైద్య జాగ్రత్తలు ముందుగానే తీసుకోవడం మంచిదని సూచించారు. ప్రాథమిక ఔషధాలు ప్రత్యేకించి క్రానిక్ రోగులకు, డయాబెటిస్, బీపీ, ఆస్తమా అవసరమైన మందులు కనీసం రెండు వారాల వరకు నిల్వ చేసుకోవాలని తెలిపారు. బాండేజ్లు, కాటన్, ఆయోడిన్, బీటాడిన్, పారసెట్ మాల్ అలర్జీ టాబ్లెట్లు, తలనొప్పి, జలుబు, జీర్ణక్రియ సంబంధిత ఔషధాలు, ఆస్తమా లేదా శ్వాస సంబంధిత రోగులకు ఇన్హేలర్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.తాగడానికి శుభ్రమైన నీరు ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.యుద్ధ పరిస్థితుల వల్ల భయం, ఆందోళన, డిప్రెషన్ రావచ్చుని పిల్లలు, వృద్ధులు మానసికంగా అసౌకర్యానికి గురవుతారని వారికి ధైర్యం చెబుతూ అండగా ఉండాలని సూచించారు సమీపంలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సమాచారం ముందుగానే తెలుసుకోవాలన్నారు. గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు, వృద్ధుల ముందుగానే డాక్టర్ను సంప్రదించి మౌఖిక సూచనలు తీసుకోవాలన్నారు. యుద్ధానికి సంబంధించి సరైన సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలన్నారు సోషల్ మీడియాలో వచ్చే అవాస్తవ వార్తలు, పుకార్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక పోలీసులు, పౌర రక్షణ శాఖ లేదా ఆర్మీ ఇచ్చే సూచనలను ఖచ్చితంగా పాటించాలి.అవసరమైతే తక్షణమే ఖాళీ చేయవలసిన ప్రాంతాల నుండి తొలగిపోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

రేపల్లె ( జనం రిపోర్టర్ ) : కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడెలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఈ నెల 20న కార్మిక సంఘాలు నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు పి. నాగాంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న 44 చట్టాలలో 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొని వచ్చిందని తెలిపారు. ఈ లేబర్ కోడ్ లు అమలు జరిగితే కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోవడంతో పాటు సమ్మె చేసే హక్కును, కోల్పోతారని చెప్పారు నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మే 20 దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు నిర్వహించతలపెట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికులు ఉద్యోగులు మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని నాగాంజనేయులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, కార్మిక సంఘాల నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

# యువతి అదృశ్యం



సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్, హయత్ నగర్, మే 08 : ( జనం రిపోర్టర్ ) : పెద్ద అంబర్ పేటకు చెందిన తలారి భాగ్య(21), తండ్రి రాజు, కూలి పని చేసుకుంటూ ఉంటుంది. తేదీ 05 రోజున ఉదయం 10:30 సమయంలో ఇడ్లీ తెచ్చుకుంటాను అని చెప్పి ఇంట్లో నుండి బయటకు వెళ్లినది. మరల ఎంతకు ఇంటికి రాలేదు. భాగ్య గురించి తన కుటుంబ సభ్యులు ఎదురుచూసి ఎంతకు తిరిగి రాకపోయేసరికి వారి బంధువుల వద్ద, భాగ్య స్నేహితుల వద్ద వెతికినా కూడా ఎటువంటి ఆచూకీ లభించక పోయేవరకు తలారి భాగ్య తండ్రి రాజు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయనైనది. తలారి రాజుకు ఇద్దరు కూతుళ్లు. తలారి భాగ్య చిన్న కూతురు.

# ఆర్ ఎఫ్ సి ఎల్ యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చిన కార్మిక సంఘాలు...

ఈనెల 20న. సమ్మెలో సమస్త కార్మిక వర్గం పాల్గొనాలి....

మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఒక్క తాటిపైకి రావాలి....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 08.గురువారం జిల్లా కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్ ఎఫ్ సి ఎల్ లో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది.ఆర్ ఎఫ్ సి ఎల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షులు అంబటి నరేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్,సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి, టియుసిఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు తోకల రమేష్,




ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు ఈ నరేష్, టిసికేఎస్ అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్, ఎఐఎఫ్టియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి.రత్నకుమార్ మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం గద్దెనెక్కినప్పటినుండి కార్మిక చట్టాలను కాలరాస్తున్నది. నాలుగు లేబర్ కోర్లను ప్రవేశపెట్టి పోరాడి సాధించుకున్న హక్కులపై దాడి చేస్తున్నది. కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా తయారు చేసేందుకు కొత్త చట్టాలను రూపొందించింది. ఈ విధానాల పైన దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఫెడరేషన్లు స్వతంత్ర సంఘాలు అన్ని కలిసి, మే 20వ. తేదీన జాతీయ సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ సమ్మె కార్మికులకు ప్రయోజనాల కోసం కార్మిక హక్కుల కోసం కార్మిక చట్టాల కోసం జరుగుతున్న సమ్మె. ఈ సమ్మెలో సమస్త కార్మిక వర్గం పాల్గొని మోడీ ప్రభుత్వానికి ఒక గుణపాఠం చెప్పాలి, ఈ సమ్మెలో ఆర్ ఎఫ్ సి ఎల్ అధికారులు అంతా కూడా పాల్గొని మద్దతు ఇవ్వాలని కోరుతున్నాం. కార్మిక వర్గం ఒకతాటిపైకి రావాలని, మే 24 జరిగే సమ్మెలో నిలబడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఐ రాజేశం, శనగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బిపిఆర్ క్రికెట్ కోచింగ్ సెంటర్ ను ప్రారంభించిన శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/ శంకర్‌పల్లి ( జనం రిపోర్టర్ ) : శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి సింగాపూర్ వార్డులో గురువారం బిపిఆర్ క్రికెట్ కోచింగ్ సెంటర్ ను శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి క్రికెట్ కోచ్ రంజి ప్లేయర్స్ మల్లికార్జున్ ను అభినందించారు. మాజీ ఎంపీపీ వారితో క్రికెట్ ఆడి వారిని ఉత్తేజపరిచారు. మాజీ ఎంపీపీ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని అన్నారు. కార్యక్రమంలో బొద్దు పాపిరెడ్డి, మాజీ కౌన్సిలర్ లావణ్య శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ బిసోల్ల శ్రీధర్, వేణుగోపాల్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# యు పీ ఎస్ సి ర్యాంకర్ ను సన్మానించిన దొంతి సారపు సంపత్



చొప్పదండి, ( జనం రిపోర్టర్ ) : కష్టపడి చదివి కన్నతల్లిదండ్రులకు ఉన్న ఊరికి గొప్ప పేరు తెచ్చిన ముద్దసాని భాను ప్రసాద్ ను తోటి యువకులు ఆదర్శంగా తీసుకోవాలని బిజెపి జిల్లా నాయకులు దొంతిసారపు సంపత్ అన్నారు.చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన ముద్దసాని బాను ప్రసాద్ ఇటీవల వెలువడిన అల్ ఇండియా యు పీ ఎస్ సి ఇంజనీరింగ్ సర్వీసేస్ పరిక్షలో 40 ర్యాంక్ సాదించినందుకు అతడిని బీజేపీ జిల్లా నాయకుడు దొంతిసారపు సంపత్ ఘనంగా సన్మానించారు.

# ఆత్మ సంస్థ చైర్మన్ గా గుర్రం రాజేందర్ రెడ్డి



చొప్పదండి, ( జనం రిపోర్టర్ ) : వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ(ఆత్మ) చొప్పదండి డివిజన్ ( చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాలు) చైర్మన్ గా చొప్పదండి పట్టణానికి



చెందిన గుర్రం రాజేందర్ రెడ్డి నియమితులైన సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో రాజేందర్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తన నియామకానికి సహకరించిన శాసనసభ్యులు మేడిపల్లి సత్యం కి కృతజ్ఞతలు తెలియజేశారు.రాబోవు రోజుల్లో మూడు మండలాల రైతులకు అధికారులతో కలిసి వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అధిక దిగుబడులు పొందే విషయంలో అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, మార్కెట్ ఛైర్మన్ కొత్తూరు మహేష్, పెరుమాండ్ల గంగయ్య గౌడ్, ముద్దం తిరుపతి, మునిగాల సుధాకర్ గౌడ్,గుర్రం రమేష్ గౌడ్, మావురపు రాములు,గుంటి స్వరూప,తోడేటి డేవిడ్, నూనె చందు,కనుమల్ల రాజశేఖర్, రజాక్, నూనె శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక
శుక్రవారం -09 -మే-2025

# తల్లీ ,తండ్రిని కోల్పోయిన పిల్లలకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుంది....

పిల్లలు ఏదైనా సమస్య ఉంటే 1098 కు ఫోన్ చేయాలి...స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 08. జిల్లాలో తల్లీ తండ్రిని కోల్పోయిన పిల్లలకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో తల్లి తండ్రినీ కోల్పోయిన పిల్లలు, వారి సంరక్షకులతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పిల్లలు తమ చదువుల్లో ముందుండాలని తెలిపారు.



పిల్లలకు ఉన్న అన్ని సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని, ప్రతి నిత్యం ఐ.సి.పి. ఎస్ సిబ్బంది వారికి అందుబాటులో ఉంటారని జిల్లా కలెక్టర్ తెలిపారు. పిల్లలందరూ వారి సమస్యలను తమకు వదిలేసి తమ చదువు తాము చదువుకోవాలని కోరారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులతో వ్యక్తిగతంగా మాట్లాడి, ఉన్నత చదువుల అవకాశాల గురించి కలెక్టర్ చర్చించారు. ప్రభుత్వం పిల్లల కోసం ప్రతి నెల తప్పనిసరిగా 4 వేల రూపాయల సహాయం ఇస్తుందని, పిల్లల సంరక్షకులు, పిల్లలు రక్త సంబంధీకులు కాబట్టి వారిని సొంత బిడ్డలతో సమానంగా చూసుకోవాలని కలెక్టర్ కోరారు. పిల్లలు ఏదైనా సమస్య ఉంటే వెంటనే 1098 కి ఫోన్ చేసి చెపితే తమ సిబ్బంది వెంటనే స్పందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల్, జితేందర్, కనకరాజు, రజిత, అనిల్ , తదితరులు పాల్గొన్నారు.

# భారత సైన్యానికి సెల్యూట్ చేసిన

పరిగి పట్టణంలోని కొడంగల్ చౌరస్తాలో వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరిగి ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి : పరిగి ( జనం రిపోర్టర్ ) : ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు.పాకిస్తాన్ కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా పరిగి ఎమ్మెల్యే రహమాన్ రెడ్డి మాట్లాడుతూ...పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ఆర్మీ 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రవాదులను అంతమొందించడం గర్వంగా ఉందని,వ్యూహాత్మకంగా మెరుపుదాడులతో పాకిస్తాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి విజయవంతంగా ఆపరేషన్ పూర్తిచేయడంపై ఇండియన్ ఆర్మీ,ఎయిర్‌ఫోర్స్,నేవీ బలగాలను ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అభినందించారు.భారతదేశ పౌరులను,ఎల్లవేళలా దేశాన్ని కాపాడుతున్న ఇండియన్ ఆర్మీ సేవలను ఎప్పటికీ కూడా మర్చిపోలేము అని భారతదేశ చరిత్రలో ఇండియన్ ఆర్మీ పోరాటం లిఖించబడుతుందని అన్నారు.తను కూడా ఒక ఆర్మీ కుటుంబం నుంచి వచ్చానని,దేశభద్రత విషయంలో పార్టీలకు అతీతంగా మద్దతు చేస్తామని రాజకీయాలను పక్కనపెట్టి దేశ రక్షణ మొదటి ప్రాధాన్యతగా భావిస్తున్నామని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికి అయినా మద్దతు పలుకుతామని తెలిపారు.

# ఆయిల్ పామ్ సాగు లక్ష్యాల సాధనకు పటిష్ట కార్యాచరణ....

**రాబోయే వానాకాలం పంటలో 1500 ఎకరాలలో ఆయిల్ పామ్ విస్తరించాలి...**

**హార్టికల్చర్ శాఖ పని తీరు పై రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష...**



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 08. ఆయిల్ పామ్ సాగు లక్ష్యాల సాధనకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో హార్టికల్చర్ శాఖ పని తీరు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, 2025-26 సంవత్సరంలో జిల్లాలో 2500 ఎకరాల ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణ లక్ష్యం సాధనకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఖరీఫ్ సీజన్ కు 1500 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యం చేరుకోవాలని కలెక్టర్ తెలిపారు.1500 ఎకరాల లక్ష్య సాధనకు మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఆయిల్ పామ్ సాగు వల్ల కలిగే లాభాలు, మొక్కలు, డ్రిప్, అంతర్ పంటల నిమిత్తం ప్రభుత్వం అందించే సబ్సిడీ, ఆయిల్ పామ్ పంట సాగు తో వచ్చే అధిక ఆదాయం సంబంధిత అంశాల పట్ల రైతులకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని అన్నారు.ఆయిల్ పామ్ సాగు అవసరమైన మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు ఆసక్తి చూపుతున్న రైతుల నుంచి వెంటనే డ్రిప్, మొక్కల కోసం డిడి సేకరించాలని అన్నారు. నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ఆయిల్ పామ్ సాగు విస్తరించేందుకు పక్కా ప్రణాళిక 4 రోజులలో తయారు చేసి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా హార్టికల్చర్ అధికారి జగన్ మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యారంగ అభివృద్ధిలో మరో మెట్టుపై గోదావరిఖని పీజీ కళాశాల...

సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి

శ్రీధర్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్.....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని గోదావరిఖని పీజీ కళాశాల అభివృద్ధికి ఒక ముఖ్యమైన మైలురాయి ఏర్పడింది. దాదాపు రూ. 9.97 కోట్లు విలువైన అకాడమిక్ నూతన భవన నిర్మాణానికి, రూ.13.80 లక్షల వ్యయంతో, ఎంబిఎ భవనానికి, అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఉదయం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ హాజరై, భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి, విద్యార్థులకు మంచి వసతులు కల్పించే దిశగా చర్యలు చేపట్టడాన్ని హర్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,"తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విద్యా శాఖ మంత్రి శ్రీధర్ బాబు లకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు



తెలుపుతున్నాను. వారి దూరదృష్టి, విద్యపై ఉన్న ప్రత్యేక శ్రద్ధ కారణంగా ఈ నిర్మాణాలు నిజమైనవయ్యాయి," అని పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగానికి చూపుతున్న పట్టుదల విశేషం.ప్రభుత్వ పాఠశాలల రూపుమాపునే మారుస్తూ, "మనా ఊరు – మనా బడి", "ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు", "గురుకులాల విస్తరణ", విశ్వవిద్యాలయాల మౌలిక వసతుల అభివృద్ధి వంటి పథకాలతో విద్యారంగాన్ని పటిష్ఠం చేస్తోంది. నేడు ప్రారంభమైన ఈ నిర్మాణాలు కూడా అదే దిశగా ముందడుగు.విద్యార్థులకు ఆధునిక తరహా తరగతి గదులు, సాంకేతిక శిక్షణకు అనుకూలమైన వసతులు, కాలేజీ ప్రాంగణ అభివృద్ధి వంటి కార్యక్రమాలు విద్యా ప్రమాణాల పెంపుకు తోడ్పడనున్నాయి.ఇది గోదావరిఖని ప్రాంత విద్యార్థులకు భవిష్యత్తులో మెరుగైన అవకాశాలను తెరవనుంది.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్ లర్, ప్రిన్సిపల్, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. అంతటా అభివృద్ధి పట్ల సంతృప్తి, ఆశాభావం కనిపించింది.

# ఈనెల 20న అంగన్వాడి టీచర్ సమ్మె..!!

# అంగన్వాడిలను ప్రభుత్వ ఉద్యోగాలగా గుర్తించాలి..!!

**కనీస వేతనాలు 32వేలుఇవ్వాలిఅందనపు పనులు రద్దు చెయ్యాలి..!! ఐసిడిఎస్ ను పరిరక్షించాలి కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు వ్యతిరేకించాలి..!! ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మె అందరూ హాజరు కావాలి..!! జిల్లా ప్రాజెక్ట్ అధికారికి సమ్మె నోటీస్ ఇచ్చిన నాయకులు అంగన్వాడి జిల్లా కమిటీ కార్యదర్శి భారతి, అధ్యక్షురాలు లక్ష్మి..!!**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : వికారాబాద్ జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ జిల్లా అధికారికి



సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్లు %డ% హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం భారతీ, వికారాబాద్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు లక్ష్మి లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చెయ్యాలని గౌరవ వేతనం మాకొద్దు కనీస వేతనాలు 32వేలు ఇవ్వాలని, అదనపు పని భారం తగ్గించాలి. ప్రభుత్వ ఉద్యోగాలు గా గుర్తించాలి. పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగ, కార్మికులకు వ్యతిరేకంగా తీస్కొచినా కేంద్ర ప్రభుత్వ కార్మిక కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ వాటికి వ్యతిరేకంగా ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మె ను జయప్రదం చేయాలని కోరుతున్నాము ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు శ్యారా యాదమ్మ స్వరూప యాదమ్మ రేణుబై పెంటమ్మ సునంద స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం నగరపాలక సంస్థ ఆస్తి పన్ను వసూల్ లో నెంబర్ వన్....



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 08. ఎర్లీ బర్డ్ ఆఫర్ లో ఆస్తి పన్ను వసూలు చేయడంలో రామగుండం నగర పాలక సంస్థ ఇతర మున్సిపల్ కార్పొరేషన్ లతో పోలిస్తే, ప్రథమ స్థానంలో నిలిచి ఉత్తమ ప్రతిభ కనబరిచింది . ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 ఆస్తిపన్ను చెల్లించిన వారికి పన్ను మొత్తంలో ఐదు శాతం రాయితీ ప్రకటిస్తూ, ప్రభుత్వం ఏప్రిల్ మొదటి వారంలో ఎర్లీ బర్డ్ ఆఫర్ ప్రకటించింది. ఎర్లీ బర్డ్ ఆఫర్ గడువు మొదట ఏప్రిల్ 30 తో ముగిసిపోయినప్పటికీ ప్రజల అభ్యర్థన మేరకు మే 07 వరకు ప్రభుత్వం పొడిగించింది. గడువు ముగిసిపోయే సమయానికి రామగుండం నగర పాలక సంస్థ 47.91 శాతం పన్ను వసూలు సాధించి ఇతర మున్సిపల్ కార్పొరేషన్లతో పోలిస్తే ప్రథమ స్థానంలో , రాష్ట్రంలోని 151 పట్టణ స్థానిక సంస్థలలో నాలుగవ స్థానంలో నిలిచింది. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో 51,033 ఆస్తి పన్ను అస్సెస్మెంట్లు ఉండగా మొత్తం పన్ను డిమాండ్ రూ 19 . 14 కోట్లు ఉంది. ఇందులో 13, 915 పన్ను అస్సెస్మెంట్ల నుండి రూ 9.7 కోట్లు వసూలయింది. రామగుండం నగర పాలక సంస్థ ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష , కమిషనర్ గా వ్యవహరిస్తున్న అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) అరుణ శ్రీ ఎప్పటికప్పుడు పన్ను వసూళ్ల పురోగతిని సమీక్షిస్తూ, సిబ్బందికి మార్గ నిర్దేశం చేయడంతో స్వల్ప వ్యవధిలోనే రామగుండం నగర పాలక సంస్థ ఈ ఘనత సాధించింది. పన్ను వసూళ్లలో రామగుండం నగర పాలక సంస్థ ముందంజలో ఉండడానికి కృషి చేసిన డిప్యూటీ కమిషనర్ వెంకట స్వామి , ఆర్.ఓ.ఆంజనేయులు , ఆర్ ఐ లు శంకర్ రావు , ఖాజా , వార్డు అధికారులు , బిల్ కలెక్టర్లను రామగుండం నగర పాలక సంస్థ ప్రత్యేకాధికారి , కమిషనర్ అభినందించారు.

# జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే విజయరమణా రావు....





రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 08. పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పెద్దపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ అండర్ 14,19,20 సీనియర్ టోర్నమెంట్ ను స్థానిక నాయకులతో, క్రీడాకారులతో కలిసి ప్రారంభించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు...అనంతరం క్రీడాకారులతో కలిసి మైదానంలో క్రికెట్ ఆడిన ఎమ్మెల్యే విజయరమణ రావు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన యువకులు



కొడిమ్యాల, ( జనం రిపోర్టర్ ) : కొడిమ్యాల మండల కేంద్రం లోని నిరుపేద కుటుంబం అయిన కళ్ళేపెల్లి చంద్రయ్య ఇటీవల అనారోగ్యం తో మరణించారు.వారి ఆర్థిక పరిస్థితిని చూసి స్థానిక యువకులు అందరూ కలిసి ఇరవై వేల రూపాయలను (20,000/-) చొప్పదండి వ్యవసాయం మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేష్ ఆధ్వర్యంలో చంద్రయ్య చిన్న కూతురి పేరు మీద పోస్టు ఆఫీస్ లో ఫిక్స్ డిపాసిట్ చేసి అకౌంట్ పాస్ బుక్ ని అందించడం జరిగింది.ఇట్టి కార్యక్రమం లో చిరంజీవి,అజయ్ ,శంకర్ సురేశ్ ,సతీష్,తదితరులు పాల్గొనడం జరిగింది.

# భారతదేశం, పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా ఎన్‌టిపిసి రామగుండంలో మెరుగైన భద్రతా చర్యలు.....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 08. భారతదేశం, పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల దృష్ట్యా, దేశవ్యాప్తంగా కీలకమైన సంస్థాపనలు అధిక అప్రమత్తంగా ఉన్నాయి. ఎన్‌టిపిసి రామగుండంలో భద్రతను అందించే బాధ్యత వహించే సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సి ఐ ఎస్ ఎఫ్ ), ఈ సదుపాయంలో భద్రతా చర్యలను గణనీయంగా మెరుగుపరిచింది. సంస్థాపన యొక్క అత్యంత భద్రతను నిర్ధారించడానికి అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోబడ్డాయి.భద్రతా వ్యవస్థను బలోపేతం



చేయడానికి అదనపు ఆయుధాలు మోహరించబడ్డాయి. డ్రోన్ దాడులను ఎదుర్కోవడం, విపత్తులకు ప్రతిస్పందించడం వంటి సంభావ్య బెదిరింపులకు సిద్ధం చేయడానికి సెంట్రల్ పోలీస్ ఫోర్స్ మాక్ కసరత్తులు నిర్వహిస్తోంది. అన్ని ప్రవేశం, నిష్క్రమణ పాయింట్లను అంకితమైన అధికారులు పర్యవేక్షిస్తున్నారు, సమగ్ర తనిఖీలు, ఫ్రిస్కింగ్ తర్వాత సిబ్బంది కదలికను నిర్వహిస్తారు. ఈ ప్రాంతంలో అప్రమత్తతను కొనసాగించడానికి గడియారం చుట్టూ వాహన పెట్రోలింగ్ జరుగుతోంది. అదనంగా,సి ఐఎస్ఎఫ్ విజిలెన్స్ బృందాలు, వివిధ వనరుల నుండి చురుకుగా సమాచారాన్ని సేకరిస్తున్నాయి, రాష్ట్ర, కేంద్ర ఇంటెలిజెన్స్ ఏజెన్సీలతో స్థిరమైన కమ్యూనికేషన్, సమన్వయాన్ని నిర్వహిస్తున్నాయి.

# అడ్డంగా బుక్ చేస్తున్న షీ టీమ్స్...



సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్, హైదరాబాద్, మే 08 : ( జనం రిపోర్టర్ ) : దేశంలో ఎన్ని కఠిన చట్టాలు అమలు చేస్తున్నా లైంగిక వేధింపులు ఆగట్లేదు. 90శాతం మహిళలపైనే కామాంధులు లైంగిక దాడికి పాల్పడుతున్నారు. పసి పిల్లల నుంచి ముసలమ్మలదాకా వయసుతో సంబంధం లేకుండా అత్యాచారాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా నగరాల్లో డేటింగ్, లివింగ్ రిలేషన్ పేరిట దారుణాలు జరుగుతున్నాయి. తాజాగా బయటపడిన కొన్ని ఘటనలపై షీ టీమ్స్ ప్రత్యేక దృష్టిపెట్టాయి. 100 మందికిపైగా నిందితులను పక్కా ఆధారాలతో పట్టుకుని శిక్షలు విధిస్తున్నాయి.నగ్న వీడియోలు తీసి బ్లాక్ మెయిల్..హైదరాబాద్‌లో ఓ వ్యక్తికి ఫేస్ బుక్ లో పరిచమైన మహిళతో అక్రమ సంబంధం కుదిరింది. దీంతో ఆమెను ఓయో రూమ్ కు తీసుకెళ్లి, నమ్మించి నగ్నంగా ఉన్నప్పుడు వీడియోలు చిత్రీకరించాడు. ఆ తర్వాత ఆమె నుంచి డబ్బులు డిమాండ్ చేయడంతోపాటు తనకు కావాల్సినప్పుడు రావాలని బెదిరించాడు. మరింతమంది స్త్రీలను శృంగారంలో కోసం పపించాలని వేధించాడు. దీంతో వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా.. షీటీమ్స్ బృందాలు అరెస్ట్ చేసినట్లు డీసీపీ డాక్టర్ ఎన్‌జేపీ లావణ్య తెలిపారు. నిదింతుడికి 3 రోజుల జైలు శిక్ష వేశారు.పోలీసులకే షాక్ ఇచ్చిన యువతి..ఇలాంటిదే మరో ఘటన వెలుగులోకి వచ్చింది. బేగంపేటకు చెందిన ఓ యువతి తన ఫ్రెండ్స్ తో కలిసి పార్టీ చేసుకుంది. అయితే ఇదంతా రహస్యంగా వీడియో తీసిన పక్క ఇంట్లో ఉండే యువకుడు.. ఆమెను బ్లాక్ మెయిల్ చేశాడు. తనతో పడుకోవాలంటూ వేధించాడు. బాధితురాలి ఫిర్యాదు చేయడంతో షీ టీమ్స్ నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా 4 రోజుల జైలు శిక్ష విధించింది న్యాయస్థానం. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ దగ్గర ఉండే ఓ యువతి గుర్తు తెలియని వ్యక్తి లైంగిక దాడి చేశాడంటూ ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. కానీ విచారణలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. పోలీసులనే టార్గెట్‌చేసిన యువతి వారి ఫోన్లు తీసుకుని అశ్లీల చిత్రాలను తన నెంబర్‌కు పంపించుకుంది. ఆ తర్వాత పోలీసులనే బెదిరించగా ఆమెపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.చెత్త బండి డ్రైవర్ పిచ్చి చూపులు..హైదరాబాద్‌లో ఇది అత్యంత దారుణమైన కేసు. ఇంటి చెత్త సేకరించే ఆటో డ్రైవర్ ఓ మహిళను లైగికంగా వేధించాడు. అసభ్యంగా మాట్లాడటం, ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో బాధితురాలు షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేసింది. డెకాయ్ ఆపరేషన్ చేసిన అధికారులు అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా 4 రోజుల జైలు శిక్ష వేసింది. మరో కేసులో ప్రేమ పేరుతో బాలికను ట్రాప్ చేసిన దుర్మార్గుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్, మాదన్నపేట, ఛత్రినాకలో బాలికలను వేధిస్తున్న గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. మరోచోట పెళ్లి చేసుకుంటానని నమ్మించి, కోరిక తీరగానే మొహం చాటేసిన యువకుడిపై షీ%-%టీమ్స్ పోక్సో కేసు నమోదు చేయించాయి. ఇదిలా ఉంటే.. బహిరంగ ప్రదేశాల్లో యువతులు, మహిళలను టార్చర్ చేస్తున్న 49 మంది పోకిరీలను షీ%-%టీమ్స్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాయి.తియ్యటి మాటలు నమ్మొద్దు..ఈ సందర్భంగా ప్రజలు, మహిళలకు పోలీసులు కీలక సూచనలు చేశారు. 'సోషల్ మీడియా పరిచయాలతో అప్రమత్తంగా ఉండండి. అపరిచితుల తియ్యటి మాటల్ని నమ్మకండి. మంచిగా మాట్లాడుతున్నారు కదా అని వ్యక్తిగత వివరాలు, ఫొటోలు షేర్ చేసుకోకండి. ఎవరైనా సోషల్‌మీడియాలో వేధింపులకు గురిచేస్తే తక్షణమే పోలీసులను ఆశ్రయించండి. మీ గోప్యతకు భంగం వాటిల్లకుండా పరిష్కారం లభిస్తుంది' అని పోస్ట్ పెట్టారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో
## ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్..

**ఆలయం ముందు కేక్ కట్ చేసిన మంత్రి..**

**భారత సైన్యానికి మద్దతు తెలుపుతూ అభినందనలు..**

**ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పిలుపు..**




చిగురుమామిడి:మండలంలోని ( జనం రిపోర్టర్ ) : సుందరగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయంలో రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా



ఆలయ అధికారులు,కార్యకర్తలు, నాయకులు,అభిమానులు,ప్రజలు మంత్రి పొన్నంకు ఆలయం వద్ద ఘన స్వాగతం పలికారు.ప్రత్యేక పూజల అనంతరం ఆలయం ముందు కార్యకర్తల సందడి మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ,నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేలా తనకు స్వామి వారి ఆశీస్సులు ఉండాలని ప్రత్యేక పూజలు చేసినట్లు చెప్పారు.దేశ సరిహద్దుల్లో జరుగుతున్న పాకిస్తాన్ కవ్వింపు చర్యలకు ఎక్కడ కూడా తగ్గకుండా భారత సైన్యం అంతర్గతంగా రక్షించుకుంటూ,సరిహద్దులను కాపాడుకుంటూ,ఎదుటివారికి ప్రవేశం లేకుండా కఠినంగా వ్యవహరిస్తు చర్యలు తీసుకుంటున్న సందర్భంగా వారికి మద్దతుతోపాటు వారికి అభినందనలు తెలిపారు.రాజకీయాలకు అతీతంగా భారత ప్రభుత్వం మరింత అంతర్గతంగా పక్క దేశాలతోటి కఠినంగా గట్టిగా ఉంటూ ఎక్కడ కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆలయ అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, కరీంనగర్ ఆర్డిఓ మహేశ్వర్,హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, తాహశీల్దార్ ముద్దసాని రమేష్, ఆలయ చైర్మన్ చొల్లేటి శంకరయ్య, అర్చకులు శేషం నరసింహ చార్యులు,శేషం సుధీర్ చార్యులు,కాంగ్రెస్ నాయకులు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి,బొలిశెట్టి శివయ్య, ఆలయ ఈవో కొండపర్తి రాజ్ కుమార్,మాజీ జెడ్పిటిసి గీకురు రవీందర్,చిట్టుమల రవీందర్,మాజీ సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్,ఆలయ కార్యనిర్వాహణ అధికారి బూట్ల కవిత,మాజీ కార్పొరేటర్ గుర్రం మురళి గౌడ్,కాటం సంపత్ రెడ్డి,పోటు మల్లారెడ్డి, ఎనగందుల లక్ష్మణ్,ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,ఓరుగంటి భారతీదేవి,పోలు స్వప్న యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని వేణు,మహమ్మద్ షాబుద్దీన్,అందే మేకల పరశురాములు,పచ్చిమట్ల జగన్,గట్టు ప్రశాంత్,బోయిని వంశీకృష్ణ,ఎనగందుల శివకుమార్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ పై యుద్ధంలిబారి ర్యాలీ తీసిన మహిళలు




చిగురుమామిడి ( జనం రిపోర్టర్ ) : కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం,సామాజిక బాధ్యతగా డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు..డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్రలో భాగంగా కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో మూడవ రోజు ఓగాలాపూర్ , ఇందుర్తి, నవాపేట్,గ్రామాలలో జేఏసీ,ఐకెపి మహిళా సంఘాల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు.తెలంగాణ సాంస్కృతిక కళాకారుల పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి,గ్రామాలలో జెఏసి డ్రగ్స్ వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించారు.సమాజంలో ఉన్న ప్రతి వర్గం పార్టీలకతీతంగా ఏకమై డ్రగ్స్ నీ నిర్మూలించినప్పుడే యువతను కాపాడుకున్న వాళ్ళం అవుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు రఘునాథ రెడ్డి, చింతపూల నరేందర్, సెక్రటరీ, నియోజకవర్గం కోఆర్డినేటర్ సారయ్య, ఏపిఎం సంపత్ , వెంకటేశ్వర్లు, మహిళా సంఘాలు, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్... కంటిన్యూ....




సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్, న్యూఢిల్లీ, మే 8 : ( జనం రిపోర్టర్ ) : ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పాకిస్తాన్‌కు భారతదేశం ఇచ్చిన సందేశం కేవలం ప్రారంభం మాత్రమే. పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా పాకిస్తాన్, పీఓకేలో ఉన్న తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా భారత సైన్యం ప్రదర్శించిన ఆపరేషన్ సింధూర్ విజయవంతమైంది. ఈ దాడిలో దాదాపు 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ దాడితో పాకిస్తాన్ దిగ్భ్రాంతికి గురైంది. అయితే, మిషన్ ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోందని భారత సైన్యం తెలిపింది. దీని వల్ల పాకిస్తాన్ పై పొంచి ఉన్న ప్రమాదం ఇంకా తప్పలేదని స్పష్టమవుతోంది. ఎందుకంటే ఆపరేషన్ సింధూర్ 2.0 లో ఏదైనా జరగవచ్చు.ఉగ్రవాదాన్ని ఆశ్రయించే వారికి ఎలాంటి ఉపశమనం లేదని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ దాడి తర్వాత పాకిస్తాన్‌లో భయాందోళనలు నెలకొన్నాయి. పంజాబ్ ప్రావిన్స్‌లో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. ప్రధాన మంత్రి షాబాజ్ షరీఫ్ దీనిని యుద్ధ చర్యగా అభివర్ణించారు. అయితే పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ఇప్పటికీ మౌనంగా ఉన్నారు. భారతదేశం ఈ చర్య ద్వారా, పాకిస్తాన్ రాజకీయ, సైనిక నాయకత్వంపై ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తుంది.భారతదేశం ఇప్పుడు కేవలం రక్షణ విధానంపైనే కాకుండా దాడి వ్యూహంపై కూడా పనిచేస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. పహల్గామ్‌కు ప్రతిస్పందనగా మొదట ఉరి, తరువాత పుల్వామా, తరువాత బాలకోట్, ఇప్పుడు ఆపరేషన్ సింధూర్. ఇదంతా భారతదేశం మారిన సైనిక ఆలోచనను ప్రతిబింబిస్తుంది. ఇప్పుడు పాకిస్తాన్ అర్థం చేసుకోవాలి, ఉగ్రవాద కర్మాగారం తన నేల నుండి పనిచేయలేమని, దానిని పనిచేయడానికి అనుమతిస్తే ఫలితం కేవలం ఖండించడం మాత్రమే కాదు, బలమైన సైనిక ప్రతిస్పందన కూడా అవుతుంది. ఈసారి పాకిస్తాన్‌ను ఒంటరి చేసే వరకు అంగీకరించబోమని భారతదేశం పూర్తి మూడ్‌లో ఉంది. అదే సమయంలో, బలూచ్‌లు పాకిస్తాన్ ప్రభుత్వంతో ఏమాత్రం సంతోషంగా లేరు. ఇది మాత్రమే కాదు, అక్కడి స్థానిక పోలీసులు కూడా ప్రభుత్వం, సైన్యం చర్యల పట్ల అసంతృప్తిగా ఉన్నారు. అటువంటి పరిస్థితిలో, పాకిస్తాన్ భూభాగాన్ని రెండు భాగాలుగా విభజించడానికి భారతదేశానికి ఇది ఒక సువర్ణావకాశం. ఏదైనా దేశం భారతదేశం వైపు కళ్ళు ఎత్తడానికి ధైర్యం చేస్తే, భారత సైన్యంలోని ప్రతి సైనికుడు మహాకాళు డి ఉగ్ర రూపాన్ని స్వీకరించడం ద్వారా దాని స్వంత భాషలో దానికి సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడనే బలమైన సందేశాన్ని ఇది ప్రపంచానికి పంపుతుంది.బలూచిస్తాన్ పాకిస్తాన్‌కు చాలారోజులుగా కొరకరాని కొయ్యగా మారింది. దానిని ప్రపంచ దృష్టి నుండి దాచిపెడుతుంది. అయితే, ఆపరేషన్ సింధూర్ 2.0 లో, పాకిస్తాన్‌ను ఒకదానికొకటి వేరు చేయడం ద్వారా ఈ బాధాకరమైన అంశాన్ని పరిష్కరించడానికి భారతదేశం సిద్ధంగా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆపరేషన్ సింధూర్ 2.0 లో 1971 యుద్ధం మాదిరిగానే బలూచిస్తాన్‌ను వేరు చేయడానికి భారతదేశం ప్రణాళిక వేయవచ్చు. దీని వలన ప్రపంచం మొత్తం భారతదేశం శక్తిని గుర్తిస్తుంది. పాకిస్తాన్‌కు మద్దతు ఇస్తున్న చైనా, టర్కీ వంటి దేశాలు కూడా పూర్తిగా మౌనంగా ఉండిపోయాయి. కాబట్టి పాకిస్థాన్ ప్రజలకు ఈ విషయాన్ని గ్రహించడం చాలా ముఖ్యం.

# నిస్సహాయితా... నిజాయితా...



సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్, హైదరాబాద్, మే 08 : ( జనం రిపోర్టర్ ) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని, అప్పుల భారం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన చేసిన ప్రకటనలు నిజాయతీగా చెప్పే ప్రయత్నమా లేక నిస్సహాయతను బహిర్గతం చేసే చర్యనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నాయకుడు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని, ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపాలని భావించే సమాజంలో, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు రాష్ట్ర ఇమేజ్‌ను, కాంగ్రెస్ పార్టీ అవకాశాలను ఎలా ప్రభావితం చేస్తాయన్నది కీలక చర్చ.రేవంత్ రెడ్డి పదే పదే రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వదిలిన అప్పుల భారంతో సమస్యలు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ఈ వ్యాఖ్యలను కొందరు నిజాయతీగా, బహిరంగంగా సత్యాన్ని చెప్పే ప్రయత్నంగా చూస్తుండగా, మరికొందరు ఇది రాజకీయంగా తప్పుడు సంకేతాలను పంపుతుందని విమర్శిస్తున్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ఆర్థిక సంక్షోభాన్ని బహిరంగంగా ప్రకటించడం వల్ల ప్రజల్లో ఆందోళన పెరుగుతుందని, పెట్టుబడిదారులు రాష్ట్రంపై విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అయితే, రేవంత్ రెడ్డి ఈ ప్రకటనల ద్వారా గత ప్రభుత్వ వైఫల్యాలను హైలైట్ చేసి, ప్రజలకు వాస్తవ పరిస్థితిని వివరించాలని భావిస్తున్నట్లు కూడా కనిపిస్తోంది.పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలతో సహా అనేక హామీలు ప్రజల్లో భారీ ఆశలను రేకెత్తించాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత, ఉచిత బస్సు పథకం, రైతు రుణమాఫీ వంటి కొన్ని హామీలను అమలు చేసినప్పటికీ, ఇతర హామీల అమలు విషయంలో ఆలస్యం జరుగుతోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దీనికి కారణమని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. కానీ, సామాన్య ప్రజలకు ఖజానా స్థితితో సంబంధం లేకుండా, హామీలు అమలు కావాలనే ఆశ ఉంటుంది. ఈ నేపథ్యంలో, ఆర్థిక సంక్షోభం గురించి మాట్లాడటం వల్ల ప్రజల్లో నిరాశ పెరిగే అవకాశం ఉందని విమర్శకులు అంటున్నారు.రాష్ట్ర ఆర్థిక ఇబ్బందుల గురించి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆర్టీసీ ఉద్యోగులు, ఇతర సర్కారీ ఉద్యోగుల ఆందోళనలను మరింత తీవ్రతరం చేశాయి. వేతనాలు, బకాయిల చెల్లింపు విషయంలో ఆలస్యం కారణంగా ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె బాట పట్టే ఆలోచనలో ఉన్నారు. ఖజానాలో డబ్బులు లేవని ముఖ్యమంత్రి చెప్పడం వల్ల ఈ ఆందోళనలు తగ్గుతాయా లేక మరింత ఉధృతమవుతాయా అన్నది ప్రశ్న. ఉద్యోగుల సమస్యలను సామరస్యంగా పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సందర్భంలో, రేవంత్ రెడ్డి నాయకత్వ శైలి, సమస్యలను ఎదుర్కొనే విధానం తీవ్ర పరీక్షకు గురవుతోంది.కేంద్ర మంత్రులు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా మరింత వివాదాస్పదమయ్యాయి. ఈ ప్రకటనలు ఒకవైపు కేంద్రంతో సంబంధాల్లో ఒడిదొడుకులను సూచిస్తుండగా, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం బలహీనంగా కనిపించేలా చేస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి. కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టుల అనుమతులు సాధించడంలో రేవంత్ రెడ్డి ఎదుర్కొంటున్న సవాళ్లు నిజమైనవే అయినప్పటికీ, ఈ విషయాన్ని బహిరంగంగా చెప్పడం వల్ల ఆయన ఇమేజ్‌పై ప్రభావం పడుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలోనూ చర్చకు దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఆయన నిజాయతీగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు వంటి నాయకులు సమర్థిస్తున్నప్పటికీ, పార్టీలోని అందరూ ఈ విధానాన్ని సమర్థించే అవకాశం తక్కువ. రాష్ట్ర ఆర్థిక సంక్షోభాన్ని బహిరంగంగా చర్చించడం వల్ల ప్రతిపక్షాలకు రాజకీయ ఆయుధం దొరికినట్లయిందని, ఇది కాంగ్రెస్ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపవచ్చని అంటున్నారు. ఈ పరిస్థితిలో, రేవంత్ రెడ్డి తన నాయకత్వ శైలిని సమతుల్యం చేసుకోవడం, సమస్యలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనే విధంగా వ్యవహరించడం కీలకం.

## మిస్ వరల్డ్ పోటీలకు అంతా సిద్ధం
## పదవ తేదీ సాయంత్రం గచ్చిబౌలి

**ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీలు అధికారికంగా ప్రారంభం.**




సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్, హైదరాబాద్, మే 08 : ( జనం రిపోర్టర్ ) : మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవానికి సమయం దగ్గర పడింది. పదవ తేదీసాయంత్రం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీలు అధికారికంగా మొదలవుతాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం విస్తృత స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఎయిర్ పోర్టుతో సహా హైదరాబాద్ నగరాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోంది. ఈ ఏర్పాట్లన్నీ దాదాపు తుదిదశకు చేరుకున్నాయి.ప్రపంచం నలుమూలల నుంచి ఇప్పటికే 95 దేశాలకు చెందిన మిస్ వరల్డ్ పోటీ దారులు హైదరాబాద్ చేరుకున్నారు. మరికొంత మంది ప్రతినిధులు వివిధ దేశాల నుంచి రానున్న రెండు రోజుల్లో వస్తారని మిస్ వరల్డ్ నిర్వాహకులు తెలిపారు. వీరికి తోడు 28 మంది మిస్ వరల్డ్ సంస్థ నుంచి నిర్వహణ ప్రతినిధులు, 17 మంది సహాయకులు వచ్చారు. గత వారం రోజులుగా వస్తున్నఅతిధులు అందరినీ తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలకు అనుగుణంగా స్వాగతం పలుకుతూ వారికి బస ఏర్పాట్లను టూరిజం శాఖ కల్పించింది. విదేశీ ప్రతినిధులు బస చేసిన ట్రిడెంట్ హోటల్ దగ్గర పోలీసులు భారీ భద్రత కల్పించారు.ఇవాళ, రేపు ఈ కంటెస్టంట్లు రిహార్సల్స్ కార్యక్రమాల్లో పాల్గొంటారు. పోటీదారులను వివిధ గ్రూపులుగా ఏర్పాటు చేసి వారు పాల్గొనబోయే కార్యక్రమాల బ్రీఫింగ్ నిర్వాహకులు చేస్తున్నారు.వివిధ దేశాలకు చెందిన కంటెస్టంట్లు విభిన్న కార్యక్రమాలు, తెలంగాణలో ఉన్న చారిత్రక, పర్యాటక ప్రదేశాల సందర్శనలో పాల్గొంటారు. అలాగే బ్రెస్ట్ క్యాన్సర్ నివారణ, మహిళలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను కూడా మిస్ వరల్డ్ కంటెస్ట్ లో భాగంగా చేపడుతున్నారు.ఏర్పాట్లపై ఇప్పటకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఉన్నతాధికారులతో సమీక్షించారు. అవసరమైన సలహాలు, సూచనలు చేశారు.ప్రకృతి, పర్యావరణ పరంగా అన్నిహంగులు ఉన్నా, తెలంగాణ ఆరంగంలో వెనుకబడిందని, ఇకపై తెలంగాణ జరూర్ ఆనా (తప్పకుండా తెలంగాణ రండి, పర్యటించండి.) అనే నినాదాన్ని విస్తృతంగా ప్రపంచవ్యాప్తం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా పర్యాటకరంగం పెరగటం, పెట్టుబడుల సాధన, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఈవెంట్ గురించి రాష్ట్ర ప్రభుత్వం దేశ విదేశాలతో పాటు అన్ని రాష్ట్రాల ప్రధాన ఏర్పోర్ పోర్టుల్లో ప్రచారం కల్పిస్తుంది.ఇక వివిధ ప్రాంతాల్లో ఈ నెలాఖరు వరకు జరిగే కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాన్ని పరిమిత సంఖ్యలో సామాన్యులకూ కల్పించేందుకు వీలుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టూరిజం వెబ్ సైట్ లో రిజిస్టర్ ) చేసుకున్న వారికి ఐదు కేంద్రాల్లో వేయి మందికి చొప్పున మొత్తం ఐదువేల మందికి మిస్ వరల్డ్ పోటీలను వీక్షించే అవకాశం కల్పించాలని భావిస్తున్నారు.

## ఉపాధి హమీలో నీటి తొట్టెల నిర్మాణం.



మొగల్తూరు, మే8 జనం రిపోర్టర్: వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెల నిర్మాణాలు చేపట్టామని ఎంపీడీవో సిహెచ్ త్రిశూల పాణి గురువారం తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మండలంలో రెండు నీటి తొట్టెల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. మండలానికి సంబందించి పేరుపాలెం నార్త్, కెపిపాలెం సౌత్ గ్రామాలకు రూ.43 వేలతో నిర్మించేందుకకు రెండు నీటి తొట్టెలు మంజూరు చేశామన్నారు. నీటి ఎద్దడి లేకుండా పశువులకు పూర్తిస్థాయిలో నీటిని అందించేందుకు ఈనీటి తొట్టెలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పలు గ్రామాల్లో పంట బోదెల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడుకుపోయిన మట్టిని తొలగించే పనులు చేపట్టాని జెఈ ఆనంద్, టి.ఎ వెంకటేశ్వరరావులు తెలిపారు.

## కె ఆర్ సి భూములను పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్



మొగల్తూరు, మే8 జనం రిపోర్టర్: కాళీపట్నం రెవెన్యూ గ్రామ పరిధిలోని భూములను గురువారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.ఎస్ నారాయణ రెడ్డి తనిఖీ చేశారు. కోనేరు రంగారావు కమిటీ ఆధ్వర్యంలో గల భూములను ఆయన క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఆయన వెంట తహసీల్దార్ రాజ్ కిషోర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## పేదలందరికీ మెరుగైన వైద్య సదుపాయాలు...
## పెద్దపల్లిలో 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన...

**ప్రైవేటు హాస్పిటల్ కు దీటుగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి...**

**ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుంది...**

**-పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు....**



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 08. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల నుండి 100 పడకలకు అప్ గ్రేడ్ చేసేందుకు మంజూరు చేయించిన రూ.51 కోట్ల వ్యయంతో నిర్మించిన, తలపెట్టిన ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి గురువారం రోజున ఆరోగ్య శాఖ అధికారులతో, స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ, శంకుస్థాపన చేసిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ...పెద్దపల్లి జిల్లా కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణమునకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడగగానే 51 కోట్లు మంజూరు చేశారు. పెద్దపల్లి ఆసుపత్రిలో ఈ 15 నెలల్లో అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగింది అన్నారు దీంతో ఈ జిల్లా ఆస్పత్రికి వివిధ మండలాల నుంచి రోజు సుమారు రోజుకు 800 మంది ఆ పైన వచ్చి పరీక్షలు చేసుకుంటున్నారు అన్నారు. ప్రవేట్ హాస్పటల్ కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రి ఉండాలని ఉద్దేశంతో నిరుపేదలకు అన్ని రకాల వైద్యం అందించాలని, ఉద్దేశంతో ఈ 15 నెలల కాలంలో అన్ని రకాల పరీక్షలు చేసే పరికరాలను సమకూర్చడం జరిగిందని అన్నారు. దీంతో నెలలో 200 ప్రసవాలు జరుగుతున్నాయని, గర్భవతులు పరీక్షల కోసం వస్తే గత ప్రభుత్వంలో, ప్రభుత్వాసుపత్రిలో స్కానింగ్ సెంటర్ లేక ప్రైవేటులో సుమారు 3500 రూపాయలు పెట్టి పరీక్షలు చేసుకునేదని, ప్రస్తుతం గర్భవతులకు స్కానింగ్ సెంటర్ కూడా ఆసుపత్రిలో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఆర్థోపెడిక్ ఆపరేషన్లు కూడా ఒక్క నెలలో 52 మందికి చేయడం జరిగింది అన్నారు. సుమారు 40 మందికి జనరల్ సర్జరీలు కూడా జరిగాయి అన్నారు. గతంలో డెంటల్ కు సంబంధించిన పరికరాలు డాక్టర్లు లేక ప్రైవేటు ఆస్పత్రి వైపు మొగ్గు చూపేవారని, ప్రస్తుతం డెంటల్ కు సంబంధించిన పరికరాలు కూడా ఈ ఆస్పత్రిలో అందుబాటులో ఉండి ఒక్క నెలలోనే సుమారు 300 మందికి డెంటల్ వైద్య పరీక్షలు కూడా నిర్వహించడం జరిగింది అన్నారు.ప్రైవేట్ ఆస్పత్రులలో గుండె పరీక్షలు చేయించుకుంటే సుమారు 4,500 రూపాయల వరకు ఖర్చు అవుతుందని, ప్రస్తుతం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో గుండెకు సంబంధించిన పరీక్షలు కూడా ఉన్నాయి అన్నారు. టు డి కో, ఈసీజీ, తోపాటు ఎంజీయోగ్రామ్ పరీక్షలు కూడా డాక్టర్లు చేస్తున్నారు అన్నారు. నెలకు సుమారు 200 మంది గుండె సంబంధించిన పరీక్షలు కూడా చేసుకోవడం జరుగుతుంది అన్నారు .ఈ 15 నెలల కాలంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలతో పాటు డాక్టర్లు అందరూ అందుబాటులో ఉన్నారు అన్నారు . ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ఈ ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల శస్త్ర చికిత్సలు , డెలివరీలు, తదితర వైద్యం అందిస్తున్న డాక్టర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప మరియు ఆరోగ్య శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ కు
## జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పులి సంపత్ గౌడ్..



చిగురుమామిడి(జనం రీపోటర్ ):పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, తెలంగాణ రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులి సంపత్ గౌడ్ గురువారం మంత్రిని హుస్నాబాద్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం విలేకరులతో పులి సంపత్ గౌడ్ మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ది ధ్యేయంగా, హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం తపిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని సంపత్ గౌడ్ ఆకాంక్షించారు.బిసిబిడ్డ పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ కి ఎమ్మెల్యే కావటం,రాష్ట్రానికి మంత్రి కావటం గర్వంగా ఉందని సంపత్ గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు.

## మత్స్యకార మహా ధర్నాను జయప్రదం చేయండి పిట్టల వెంకటేష్ జిల్లా అధ్యక్షులు




చొప్పదండి, ( జనం రిపోర్టర్ ) : తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం చొప్పదండి నియోజకవర్గం సమావేశం పిట్టల వెంకటేష్ అధ్యక్షతన చొప్పదండి ముదిరాజ్ భవన్ లో నిర్వహించడం జరిగింది.మే 15న మత్స్యకారుల జాతీయ డిమాండ్స్ డే సందర్భంగా ఇంద్రపార్క్ వద్ద జరిగే మత్స్యకారుల మహా ధర్నా ఫోస్టర్ ఆవిష్కరణ చేసారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై పిట్టల వెంకటేష్ ఈ ఏడాది ఉచిత చేప పిల్లలకు బదులుగా మత్స్య సోసైటిల జల వనరులకు సరిపోయేంత చేప పిల్లల కొనుగోలు కోసం మత్స్య సొసైటీ ఖాతాలో నగదు జమ చేయాలని, కబ్జాలకు గురైన చెరువులు, కుంటలు, కాల్వలను శాటిలైట్ ద్వారా సర్వే చేసి ఎఫ్ టి ఎల్ హద్దురాళ్లు ఎర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఎన్ సి డి సి, ఎన్ ఎఫ్ డి బీ స్కీములు పునరుద్ధరించాలని తద్వారా మత్స్యకారులకు 90% సబ్సిడీతో టు వీల్లర్, ఫోర్ విల్లర్ వాహనాలు 90 శాతం సబ్సిడీ తో రుణాలు మంజూరు చేయాలని, 50ఎండ్లు నిండిన మత్స్యకారులకు వృద్ధాప్య పింఛను ఇవ్వాలని, ప్రాదమిక మత్స్య సోసైటిల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో ఉపాధ్యక్షులు నూనె శేఖర్,కార్యదర్శి పిట్టల సంపత్పిట్టల నర్సయ్య,పిట్టల ఎల్లయ్య, గణవేని రాము, పిట్టల లచ్చయ్య, పిట్టల రాము, కూన సతీష్, పిట్టల నరేష్, పిట్టల రాము, పిట్టల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొత్తవలస టు నాటు కాలనీ లో వైన్ షాప్ చోరీ నిందితులను పట్టుకున్న పోలీసులు



( జనం రిపోర్టర్ ) : కొత్తవలస మండలం, టు. నాట్. టు. కోనాలిలో ఉన్న వైన్ షాపును గత నెల 28వ తేదీ అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వైన్ షాప్ యొక్క సేట్టరు ను విరగోట్టి వైన్ షాపులోని ఐదు బాక్సులు గల కోటర్ బోటిల్స్ ను మొత్తం 240 దొంగలించుకొని పరారయ్యారు పిమ్మట షాపు సూపర్వైజర్ ఇచ్చిన ఫిర్యాదు పై కొత్తవలస సర్కిల్ ఇన్స్పెక్టర్ సి.హె.చ్ షణ్ముఖరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి నిందితులను గుర్తించి నిందితులు ముగ్గురు పాత నేరస్తుల అయినా పెంద్రి యోహాను, పెంద్రీ దర్శన బాబు , పెంద్రు యేసు వీలు ముగ్గురు కలిసి వైన్ షాప్ ను దొంగతనం చేసినట్లు నిర్ధారించారు , ముగ్గురిలో ఇద్దరిని సబ్ ఇన్స్పెక్టర్ మన్మధ రావు కొత్తవలస గ్రామ ఆర్చ్ వద్ద పట్టుకొని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి కొన్ని మద్యం బోటిల్స్ ను రికవరీ చేసి నిందితులిద్దర్నీ రిమాండ్ నిమిత్తం కొత్తవలస కోర్టులో హాజరపరిచినట్లు ఈ సందర్భంగా, మీడియా ద్వారా ప్రజలకు తెలియపరిచారు, ఇంకా మూడో ముద్దాయిన యేసుపరారీలో ఉన్నట్లు తెలియజేసినారు అతన్ని కూడా అరెస్టు చేస్తున్నట్లు కొత్తవలస సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ షణ్ముఖరావు తెలియపరిచారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాళ్లు, రైటర్ యువరాజ్, పి సీలు, రమేష్, దాసరి దేవుడు, సతీష్, దేవుడు బాబు, భాస్కర్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు,

## వైయస్ జగన్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రజా ప్రతినిధులు



నందలూరు, ( జనం రిపోర్టర్ ) : విజయవాడ తాడేపల్లి వైఎస్ఆర్సీపీ సెంట్రల్ ఆఫీస్ నందు వైఎస్ఆర్సిపి రాష్ట్ర పార్టీ అధ్యక్షులు మరియు మాజీ ముఖ్యమంత్రివర్యులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన యం.పి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి, రాజంపేట యం.పి పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటీ అమర్ నాథ్ రెడ్డి మరియు రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసుల రెడ్డి గార్ల సమక్షంలో గురువారం నిర్వహించిన ప్రజాప్రతినిధుల సభ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వీరి వెంట రాజంపేట నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ అన్నమయ్య జిల్లా అధికార ప్రతినిధి విశ్వనాథ్ రెడ్డి, స్టేట్ వైఎస్ఆర్సీపీ పబ్లిసిటీ వింగ్ సెక్రటరీ సుబ్బరామిరెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు వడ్డె రమణ, స్టేట్ మైనారిటీ సెల్ సెక్రెటరీ జహీద్, రాజంపేట పట్టణ అధ్యక్షులు కృష్ణారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మునాఫ్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మర్రి రవికుమార్, రాజంపేట మున్సిపాలిటీ కౌన్సిలర్స్ నవీన్ గుప్తా, విష్ణు వర్ధన్ నాయక్, రమేష్ నాయుడు, రఘురామి రెడ్డి, పెంచలయ్య నాయుడు, బిల్లా నాగరాజు, కాజా, లక్ష్మీనారాయణ, మైనార్టీ నాయకులు హైదర్, కళ్యాణ్ కుమార్ రెడ్డి, రెడ్డియ్య, తదితరులు పాల్గొన్నారు.

## రైస్ కార్డు పొందుటకు అర్హతలు



నార్పల ( జనం రిపోర్టర్ ) : కొత్త రేషన్ కార్డును పొందాలనుకునేవారు ఎలాంటి అర్హతలు ఉండాలో గురువారం తహసీల్దార్ కే. అరుణకుమారి పత్రికా ప్రకటనలో తెలిపారు.కొత్త బియ్యం కార్డు పొందే వ్యక్తి ఖచ్చితంగా ఆంధ్రప్రదేశ్ స్థానికుడు అయ్యి ప్రజసాధికార సర్వే అనగా హౌస్ హెూల్డ్ మాపింగ్ లో తప్పనిసరిగా ఉండవలెను.ఏ సచివాలయం పరిధిలో మ్యాపింగ్ అయ్యి వుంటారో ఆ సచివాలయం పరిధిలో మాత్రమే బియ్యం కార్డు అప్లై చేసుకోవాలి. ముఖ్యంగా ఖచ్చితంగా ఆధార్ యొక్క డీటెయిల్స్ ఆ గ్రామానికి చెందినవి మాత్రమే అయ్యి ఉండాలి. అతి ముఖ్యమైన నిబంధన ఏమిటంటే ఇప్పటి వరకు ఎవరికీ అయితే బియ్యం కార్డు లేదో అనగా ఆ వ్యక్తి వాళ్ళ అమ్మ బియ్యం కార్డు లో కానీ అత్త కార్డు లో కానీ లేని వారికి మాత్రమే కొత్త బియ్యం కార్డు జారీ చేస్తారు. బియ్యం కార్డు లో వ్యక్తులను జోడించడం చిన్నపిల్లల్ని యాడ్ చేయడానికి వారి యొక్క డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్, పెళ్లి అయిన వధువుని జోడించుటకు వారి యొక్క మ్యారేజ్ సర్టిఫికెట్ లేదా ఆధార్ కార్డు లో వారి యొక్క భర్త పేరు వున్నచో దానిని పరిగణలోకి తీసుకొంటారు.ఖచ్చితంగా ఆధార్ కార్డు అడ్రస్ ఆ గ్రామానిది అయ్యి ఉండవలెను. బియ్యం కార్డు విభజించడానికి ముందు వారు ప్రజాసాధికార సర్వే లో సపరేట్ గా ఉండవలెను. లేనిచో విభజించుట కుదరదు. బియ్యం కార్డు లో వ్యక్తిని తొలగించాలంటే చనిపోయిన వ్యక్తిని మాత్రమే మనం బియ్యం కార్డు నుంచి తొలగించొచ్చు. అలా కాకుండా చాలా మంది మా అబ్బాయి వేరే దేశంలో వున్నాడు తను సంపాదించేది మాకు పెడతాడా కార్డు లో నుంచి తీసేయండి, ప్రజాసాధికార సర్వే లో నుంచి తప్పించి మాకు బియ్యం కార్డు ఇవ్వమని అడుగుతున్నారు అలాంటివాళ్ళకి గవర్నమెంట్ వారు మళ్ళీ ఆప్షన్ ఇచ్చినపుడు మాత్రమే చేస్తారని తెలిపారు. తప్పుగా వున్నా ఆధార్ నీ అలా వదిలేసి కొత్త ఆధార్ తో ముందుగా ప్రజాసాధికార సర్వే లో యాడ్ అయిన తరువాత మాత్రమే ఆధార్ సీడ్ చేస్తారని, ఆధార్ అడ్రస్ ఖచ్చితంగా గా ఆ సచివాలయం అడ్రస్ ఉండవలెను మరియు కుటుంబ పెద్ద వేలి ముద్రతో మాత్రమే మనం ఇది చేయగలము. బియ్యం కార్డు వద్దనుకున్న వారు వారి యొక్క బియ్యం కార్డు ని సరెండర్ చేసుకోవచ్చని తెలిపారు.

## ప్రభుత్వాసుపత్రిలో ఇందుర్తి గర్భిణి మహిళ ప్రసవం.. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన శిరీష.. వైద్య బృందాన్ని అభినందిస్తున్న మండల ప్రజలు..



చిగురుమామిడి( జనం రిపోర్టర్ ):మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన అందే శిరీష చిగురుమామిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు.ఉదయం 6గంటలకు పురిటి నొప్పులతో 108అంబులెన్స్ లో ఆసుపత్రికి వచ్చిన శిరీషకు డాక్టర్ ప్రిసిల్ల,వైద్య సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి సాధారణ కాన్పు చేశారు.ఈ కాన్పులో పండంటి మగ బిడ్డకు



జన్మనివ్వగా బాబు మూడున్నర కిలోలు ఉన్నాడని,తల్లి,బిడ్డ క్షేమంగా ఉన్నారని డాక్టర్ తెలిపారు.విజయవంతంగా డెలివరీ చేసిన వైద్యులను మండల ప్రజలు అభినందిస్తున్నారు.ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు నమ్మకంగా ఉండాలని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకూడదని మండల ప్రజలు అభినందిస్తున్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సంతోష్,సూపర్వైజర్ చంద్రకళ, స్టాఫ్ నర్స్ దీపిక,ఏఎన్ఎం కవిత, ఆశ వర్కర్ లక్ష్మి,స్టాఫ్ నర్స్ సునీత లు పాల్గొన్నారు.

## అనవసరంగా అర్ధరాత్రి రోడ్లపై జులాయిగా తిరుగుతూ

### అసాంఘిక చట్ట వ్యతిరేక పనులు చేస్తున్న వ్యక్తులే లక్ష్యంగా ఆపరేషన్ చబుత్రా

రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధి పెద్దపల్లి జిల్లా గోదావరిఖని 1టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డి సి పి కర్ణాకర్ ఆదేశాల మేరకు గోదావరిఖని ఏ సి పి ఎం రమేష్ పర్యవేక్షణ లో ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి ఆధ్వర్యంలో ఆపరేషన్ చబుత్రా ను నిర్వహించారు. పోలీస్ అధికారులు సిబ్బంది తో కలిసి బైక్ పై పెట్రోలింగ్ చేస్తూ రాత్రి వేళల్లో ప్రధాన కూడళ్ళు, వీధులు, రోడ్ల పై గుంపులుగా జులాయిగా తిరుగుతూ ప్రజలను ఇబ్బందిలకు గురిచేస్తూ, మద్యం సేవించి రోడ్లపై ద్విచక్ర వాహనాలతో తిరుగుతున్న యువకులను, అనుమానస్పదంగా తిరుగుతు ఉన్న వారిని 60 మంది యువకులను, 29 బైక్ లు, 01, కారు అదుపులోకి తీసుకోవడం జరిగింది. పట్టుబడిన వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. పట్టుబడిన వారి పై ఇ - పెట్టి కేసు నమోదు చేసి, కౌన్సిలింగ్ నిర్వహించి భవిష్యత్తు మరల పట్టుబడినచో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి మాట్లాడుతూ ఆ కారణంగా ఎలాంటి పని లేకుండా అవసరమైతే తప్ప అర్ధరాత్రి దాటిన తర్వాత ఎవరు కూడా వీధుల్లో తిరిగరాదని తెలిపినారు. రాత్రి 10 గంటల తర్వాత ఎవరైనా యువకులు రోడ్లపై విన్యాసాలు చేస్తూ, గుంపులుగా కనబడితే వారిని అరెస్ట్ చేసి వాహానాలను సీజ్ చేస్తామన్నారు.తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండి రాత్రి వేళలో ఆ కారణంగా బయటికి వెళ్లకుండా చూడాలని తెలపడం జరిగింది. యువత ఏలాంటి చెడు మార్గాలకు వెళ్లకుండా తమ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని తెలిపినారు.చెడు వ్యసనాలకు అలవాటు పడి రాత్రి పూట బయట తిరుగుతూ ప్రమాదాలకు గురికావడం జరుగుతుంది. ఆపరేషన్ చభుత్ర లో పట్టుబడిన వారి యొక్క వెహికల్స్ ను స్వాధీనం చేసుకొని వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి తెలిపినారు. ఈ యొక్క ఆపరేషన్ చభుత్ర లో గోదావరిఖని వన్ టౌన్ ఎస్ఐ రమేష్, శ్రీనివాస్, భూమేష్, కోటేశ్వర్ లు, పోలీస్ స్టేషన్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## భానుడు భగభగ..ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి..

కేంద్రంలో భానుడు భగభగ అంటున్నాడు. ఎండలు విపరీతంగా ఉండడంతో మరోపక్క విద్యుత్ కోతలు విధించడంతో ప్రజలు ఉక్క పోతతో అనేక ఇబ్బందుల్లో పడుతున్నారు. మున్సిపాలిటీ కేంద్రాలలో కరెంటు కోతలు కానీ తాగినిటి ఎద్దడిగాని ఉండకూడదని ఇటీవల జిల్లా కలెక్టర్ దేవరకద్రకు వచ్చినప్పుడు అధికారులకు ఆదేశించడం జరిగింది. ఎప్పుడు పడితే అప్పుడు కరెంటు సరఫరా లేక ప్రజలు అనేగా అవస్థలు పడ్డారు.గత రెండు మూడు రోజుల కిందట కరెంటు కోతలు ఈ విధంగా ఉండేవి కావని కేవలం రెండు మూడు రోజుల నుంచి ఈ సమస్య ఏర్పడిందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు శ్రద్ధ తీసుకొని దేవరకద్ర నియోజకవర్గ కేంద్రము అలాగే మున్సిపాలిటీ కేంద్రము లో విద్యుత్ కోత తాగనీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు ముక్తకంఠంతో కొరు తున్నారు.

## అర్థశాస్త్రంలో డాక్టరేట్ అవార్డు అందుకున్న సిరోళ్ల సౌలు రాజు..

నియోజకవర్గ పరిధిలో చిన్నచింతకుంట మండల పరిధిలోని చిన్న వడ్డేమాన్ కి చెందిన సిర్రోళ్ల సౌల్ రాజుకు ఉస్మానియా యూనివర్సిటీ గురువారం డాక్టర్ రేటు అవార్డు అందుకున్నారు. అర్థశాస్త్ర విభాగంలో వ్యవసాయ రంగం- నీటిపారుదల వనరుల అధ్యయనం- తెలంగాణలోని మహబూబ్నగర్ జిల్లాకు సూచన అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగం ఆచార్యులు డైసీ పర్యవేక్షణలో పరిశోధన చేసినట్లు తెలిపారు. డాక్టరేటు అందుకున్న సౌల్ రాజును పలువురు అభినందించారు.

## గోశాలకు పశుగ్రాసం పంపిణి..

: దేవరకద్ర మండల కేంద్రంలో స్థానిక ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గోశాలకు గురువారము గ్రామానికి చెందిన మద్దూరు అరుణ్ కుమారు, అలాగే గుడిసెల వెంకటేష్, ఇద్దరు రెండు ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని పంపిణీ చేసినట్లు ఆలయ అర్చకులు నాగరాజు తెలిపారు. ప్రతి ఒకరు కూడా గోమాతను కాపాల్సిన బాధ్యత ఎంతైనా ఉన్నది అని ఆయన అన్నారు. చాలామంది రైతులు కూడా గోశాలకు పుశుగ్రాసాన్ని అందజేయడం జరిగిందని ఆయన చెప్పారు.

### కళాశాల నూతన భవన నిర్మాణానికి

## భూమి పూజ చేసిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

: స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాల గోదావరిఖనిలో సుమారు 10 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో తో నిర్మించే నూతన భవన నిర్మాణానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మరియు శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ యు ఉమేష్ కుమార్ చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గం లో విద్యార్థులకు అవసరమయ్యే వివిధ రకాల మౌలిక సదుపాయాలను సమకూరుస్తున్నామని అదేవిధంగా పారిశ్రామిక ప్రాంతంలోని విద్యార్థిని విద్యార్థుల నైపుణ్య అభివృద్ధికై భవిష్యత్తులో మరిన్ని చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ మాట్లాడుతూ అకాడమిక్ బ్లాక్ నిర్మాణంతోపాటు ఎంబీఏ బ్లాక్ అప్రోచ్ రోడ్ ను కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఏర్పాటుచేసిన చేసిన డిజిటల్ క్లాస్ రూమ్ ని వైస్ ఛాన్సర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్, రిజిస్టర్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, ఓ ఎస్ డి టు విసి డాక్టర్ హరికాంత్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్, శాతవాహన యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ డాక్టర్ మనోహర్, ఇంజినీర్ ప్రకాష్ రావు, సంతోష్ కుమార్, శ్రీకాంత్ మరియు యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాకాంత్, అధ్యాపకులు డాక్టర్ రమేష్ రెడ్డి, డాక్టర్ రవి, డాక్టర్ ప్రసాద్, అజయ్ కుమార్, కళాశాల బోధ నేత సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మే 17 లోపు లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

మే 17 లోపు లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ దరఖాస్తులు ఆహ్వానిస్తుందని, మే 5 నుంచి మీ సేవా కేంద్రాలలో 100 రూపాయలు చెల్లించి దరఖాస్తు, ప్రాస్పెక్టస్ పొందవచ్చని, మే 17 లోపు ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను మీసేవ కేంద్రాల్లోని సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఇంటర్ లో గణితం లో 60 శాతం మార్పులు సాధించిన వారు, ఐటిఐ డ్రాఫ్ట్ మెన్ సివిల్, డిప్లమా సివిల్, బిటెక్ సివిల్ లేదా సమానమైన అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు 50 పని దినాలలో శిక్షణ ఇస్తామని, శిక్షణ కోసం ఓసి అభ్యర్థులు పదివేల రూపాయలు బి సి అభ్యర్థులు 5000 రూపాయలు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 2500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు 9849081489, 7032634404, 9441947339 ఫోన్ నెంబర్ల నందు సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## తల్లి తండ్రిని కోల్పోయిన పిల్లలకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుంది జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

### పిల్లలు ఏదైనా సమస్య ఉంటే 1098 కు ఫోన్ చేయాలి

పెద్దపల్లి జిల్లా లో తల్లి, తండ్రిని కోల్పోయిన పిల్లలకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో తల్లి, తండ్రిని కోల్పోయిన పిల్లలు వారి సంరక్షకులతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పిల్లలు తమ చదువుల్లో ముందుండాలని తెలిపారు. పిల్లలకు ఉన్న అన్ని సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని, ప్రతి నిత్యం ఐ సి పి ఎస్ సిబ్బంది వారికి అందుబాటులో ఉంటారని జిల్లా కలెక్టర్ తెలిపారు. పిల్లలందరు వారి సమస్యలను తమకు వదిలేసి తమ చదువుతాము చదువుకోవాలని కోరారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థుల తో వ్యక్తిగతంగా మాట్లాడి ఉన్నత చదువుల అవకాశాల గురించి కలెక్టర్ చర్చించారు. ప్రభుత్వం పిల్లల కోసం ప్రతి నెల తప్పని సరిగా 4 వేల రూపాయల సహాయం ఇస్తుందని, పిల్లల సంరక్షకులు పిల్లలు రక్త సంబంధీకులు కాబట్టి వారిని సొంత బిడ్డలతో సమానంగా చూసుకోవాలని కలెక్టర్ కోరారు. పిల్లలు ఏదైనా సమస్య ఉంటే వెంటనే 1098 కి ఫోన్ చేసి చెపితే తమ సిబ్బంది వెంటనే స్పందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల్, జితేందర్, కనకరాజు, రజిత, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి చట్టంతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం.. ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి..

భూ భారతి ద్వారా రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గ పరిధిలో మూసపేట్ మండల పరిధిలోని కొమ్మిరెడ్డి పల్లె గ్రామంలోభూభారతి పైలెట్ ప్రాజెక్టులో భాగంగా గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో జాయింట్ కలెక్టర్ మోహన్ రావు మరియు రెవెన్యూ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ...భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు,ఈ సదస్సులను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయనకోరారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం అప్పనంగా భూములను దోచుకునేందుకు నలుగురు వ్యక్తులు తయారుచేసిన చట్టమే ధరణి అని పేర్కొన్నారు,గత ఎన్నికల్లో ధరణి అనే దరిద్రపుగొట్టు చట్టాన్ని బంగాళాఖాతంలో కలిపి, భూభారతి చట్టాన్ని తీసుకు వస్తామని చెప్పి, భూభారతి తీసుకువచ్చామన్నారు.ధరణి పేరుతో లక్షల కోట్ల విలువ చేసే భూములను బిఆర్ఎస్ నాయకులు కాజేసి, ఆ డబ్బుల మదంతో మదమెక్కి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.భూభారతి చట్టంతో మాజీ ముఖ్యమంత్రి కుటుంబ భూ బండారాలు, బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమాలను బయట పెడతామని తెలిపారు, ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టంతో జైలు పాలవుతామన్న ఆందోళనతో మాజీ ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు అడ్డగోలుగా ముఖ్యమంత్రి పై విమర్శలు చేస్తున్నారని ఆయన అన్నారు.ముఖ్యమంత్రి గత ప్రభుత్వం చేసిన 8 లక్షల కోట్ల రూపాయల అప్పును ప్రభుత్వం బయట పెట్టడం తప్పు ఎలా అవుతుందని బిఆర్ఎస్ నాయకులను ఆయన నిలదీశారు.ప్రపంచంలో 8వ వింతగా బిఆర్ఎస్ నాయకులు చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్ట్ సంవత్సరానికే కూలిపోతే, కూలిపోయందని చెప్పడం తప్పా అన్నారు. గత ప్రభుత్వ దుర్మార్గాలను ముఖ్యమంత్రి చెబుతూ ఉంటే తట్టుకోలేక ఫ్రస్టేషన్లో బిఆర్ఎస్ నాయకులు ఏదేదో మాట్లాడుతున్నారని, వారి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని ఆయన అన్నారు.ఆర్థికంగా రాష్ట్రం దివాళ తీసిన...ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్లతో రెండు లక్షల రుణమాఫీ చేసారని, ప్రతి నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇళ్లు ఇస్తున్నామని, భూభారతి చట్టం తీసుకొచ్చి రైతులకు అండగా ఉన్నామని, ఆర్టీసీ ఉచిత బస్ ప్రయాణం, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం, 500 కే సిలిండర్, 10 లక్షల ఆరోగ్యశ్రీ, భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 500 బోనస్ మరియు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు 50,000 ఉద్యోగాలు ఇచ్చామని, ఇలా చెప్పుకుంటూ పోతే చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేశామని గత పదేళ్ళలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని కార్యక్రమాలను కేవలం 16 నెల్లలలో మేము చేసి చూపించామని ఆయన అన్నారు. అదేవిధంగా రెవెన్యూ సదస్సుల్లో భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం వంటి వాటిని పరిష్కరిస్తున్నామన్నారు.వివిధ కారణాల వల్ల రెవెన్యూ సదస్సులో అర్జీలు సమర్పించే అవకాశం లభించని వారు, తరువాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మా లో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు.అనంతరం అడ్డాకుల, మూసాపేట్ మండలాల కళ్యాణలక్ష్మీ, షాది ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మానకొండూర్ నియోజకవర్గంలో శంకరపట్నం మండలం టీడీపీ కార్యకర్తల సర్వసభ్య సమావేశం - విజయవంతం!

### పార్టీకి పూర్వ వైబోవం తీసుకొస్తాం

:ానకొండూర్ నియోజకవర్గంలో ని శంకరపట్నం మండలం లో అడ్ హాక్ కమిటీ పార్లమెంట్ సభ్యులు మోరే ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ముఖ్య కార్యకర్తల సమావేశానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రొడ్డ శ్రీనివాస్లి మానకొండూర్ నియోజకవర్గ పరిశీలకులకు ఘన స్వాగతం పలుకుతున్నాము. ఈ కార్యక్రమంలో రొడ్డ శ్రీనివాస్ మాట్లాడుతూ.టీడీపీ 44 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు స్థాపించిన ఈ పార్టీ, తెలుగు ప్రజల జీవితాల్లో సామాజిక, ఆర్థిక, మానసిక మార్పులను తీసుకొచ్చింది. ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లిన ఏకైక పార్టీగా టీడీపీ నిలిచింది. మానకొండూర్ నియోజకవర్గంలో అన్ని మండలాలు గ్రామాల కమిటీలు వేసుకొని పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సత్తా చటుతం అని అన్నారు. గురువారం శంకరపట్నం మండల కమిటీ తో పాటు మండలం లోని 18 గ్రామ కమిటీ లను ఏకగ్రీవంగా అందరి ఆమోదంతో ఎన్నుకొని జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు అనుమతికోసం పంపించడం జరిగింది అని పేర్కొన్నారు..ఈ గర్వకారణమైన పార్టీలో అడ్ హాక్ కమిటీ పార్లమెంట్ సభ్యులు మోరే ప్రభాకర్ తన బాధ్యతను గౌరవంగా భావిస్తున్నారు.1983 నుండి టీడీపీ ప్రజా సంక్షేమం, అభివృద్ధిని రెండు చక్రాలుగా ముందుకు తీసుకెళ్లింది. శ్రీ నారా చంద్రబాబు నాయుడు అసాధారణ నాయకత్వంతో హైదరాబాద్ను అభివృద్ధి చేసి, రవాణా, రహదారులు, విద్య, ఉద్యోగాలు, ఐటీ పరిశ్రమలలో చరిత్ర సృష్టించారు. 75వ ఏట కూడా 25 ఏళ్ల యువకుడి ఉత్సాహంతో రోజుకు 16 గంటలు శ్రమిస్తూ ఆంధ్రప్రదేశ్ను ఎఐ యుగంలోకి నడిపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపి సీనియర్ నాయకులు బైరి తిరుపతి, షాబీర్, కదిరే కొమురయ్య, మహబూబ్ అలీ, వీరమళ్ళు, దసరాపు సాగర్ తో పాటు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొని ఉత్సాహాన్ని కొనసాగించి, పార్టీని మరింత బలోపేతం చేద్దాం! అని అన్నారు.

## వాటర్ ట్యాంకు వద్ద పారిశుధ్య వాహనాలను తరలించాలని జోనల్ కమిషనర్ కు వినతి



మాధవధార (జనం రిపోర్టర్) : జీవీఎంసీ 51 వ వార్డు మాధవధార మాధవస్వామి గుడికి వెళ్లే దారిలో వాటర్ ట్యాంక్ వద్ద గత 20 రోజుల నుంచి పారిశుధ్య వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఈ విషయమై మాధవధార మాజీ కార్పొరేటర్ పూజారి మధుసూదన్ రావు, 50వ టిడిపి అధ్యక్షులు సనపల వరప్రసాద్ జీవీఎంసీ జోన్ - 5 జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముని కలిసి వినతిపత్రం అందజేశారు. మాధవధార,తెనేటి నగర్, కళింగనగర్ ప్రాంతాలకు సరఫరా అయ్యే మంచినీటి వాటర్ ట్యాంకు వద్ద పారిశుద్ధ్య వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల మంచినీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, అదేవిధంగా వాటర్ ట్యాంక్ బయట ప్రతిరోజు బాలబాలికలు బాక్సింగ్ క్రీడలో శిక్షణ పొందుతూ ఉన్నారని ఈ పారిశుధ్య వాహనాలతో దుర్గంధం వలన అటుగా వెళ్తున్న పాదాచారులు,వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వినతిలో పేర్కొన్నారు.తక్షణమే వాటర్ ట్యాంకు వద్ద నుంచి పారిశుధ్య వాహనాలను తరలించాలని కోరారు. ఈ విషయమై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలో వార్డులో పర్యటన చేసి సమస్యను పరిశీలించి పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.

## పేర్లు రాసుకొని పెట్టుకోండి.. ఎవ్వరినీ వదలం.. సప్త సముద్రాల అవతల ఉన్నా విడిచిపెట్టం..!



**అమరావతి,:** ఎవ్వరినీ వదలం.. ఎక్కడున్నా.. కార్యకర్తల్ని ఇబ్బంది పెడుతున్న పోలీసు అధికారుల పేర్లు రాసుకోండి అని సూచించారు వైఎస్ జగన్.. వైసీపీ కేంద్ర కార్యాలయంలో అన్నమయ్య జిల్లా రాజంపేట మున్సిపాలిటీ, చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం, శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మున్సిపాలిటీ, పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మున్సిపల్ చైర్ పర్సన్లు, మున్సిపల్ వైస్ ఛైర్ పర్సన్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలతో పాటు ఆయా జిల్లాల ముఖ్య నేతలతో ప్రత్యేకంగా భేటీ అయిన వైఎస్ జగన్.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మీ బాధలు చూస్తున్నాను.. హామీ ఇస్తున్నాను.. కేవలం వైసీపీని ప్రేమించినందుకు, పార్టీని అభిమానించినందుకు కార్యకర్తలు పడుతున్న బాధను చూశాను.. అందుకే జగన్ 2.0 లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తాను. వారికి పూర్తి న్యాయం చేస్తాను.. ఎవ్వరినీ వదలం.. ఎక్కడున్నా.. కార్యకర్తల్ని ఇబ్బంది పెడుతున్న పోలీసు అధికారుల పేర్లు రాసుకోండి.. అధికారంలోకి వచ్చాక వారిని చట్టం ముందు నిలబెడదామని హెచ్చరించారు. ఈరోజు చంద్రబాబు, పోలీసులు చేస్తున్న దుర్మార్గం.. వారు ఏదైతే విత్తనం వేస్తున్నారో రేపు అదే పెరుగుతుందన్నారు జగన్.. అందుకే ఈరోజు దౌర్జన్యాలు చేస్తున్న అధికారులు, పోలీసులు.. ఆరోజు ఎక్కడున్నా, రిటైర్ అయినా, సప్త సముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టం.. అది మామూలుగా ఉండదు అని వార్నింగ్ ఇచ్చారు.. పశ్నించకూడదని నిరంకుశత్వం, డైవర్షన్.. ఈరోజు తప్పుడు కేసులు, తప్పుడు సాక్ష్యాలు. సంబంధం లేకున్నా కేసుల్లో ఇరికిస్తున్నారు.. ఇలాంటి రాజకీయాలు గతంలో ఏనాడూ చూడలేదు.. చంద్రబాబు ఇవన్నీ ఎందుకు చేస్తున్నాడంటే, ఆయన ప్రజల్లో చులకన అయ్యారు. హామీలు అమలు చేయడం లేదు. దీంతో ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోంది.. ఎవరూ ప్రశ్నించకూడదని, రాష్ట్రంలో భయానక పరిస్థితి సృష్టిస్తున్నాడని పేర్కొన్నారు.. ఎక్కడ ఏ సమస్య వచ్చినా, ప్రజల్లో వ్యతిరేకత కనిపించినా, వెంటనే డైవర్షన్. ఒకరోజు తిరుపతి లడ్డూ అంటాడు. ఇంకోరోజు సినీ నటి కేసు అంటాడు.. వారికి ప్రజల్లో వెళ్లే ధైర్యం లేదు.. ప్రజలు అడిగే ప్రశ్నలకు చంద్రబాబు సమాధానం చెప్పలేడు. టీడీపీ వారు ఎక్కడికి వెళ్ళినా.. ఏం జరుగుతుంది.. నా 15 వేలు ఏమయ్యాయని పిల్లలు, మా 26 వేలు ఏమయ్యాయని రైతులు, అవ్వలు వారి 48 వేలు, యువత తమ 36 వేలు ఏమయ్యాయని అడుగుతారు.. ఎన్నికల ముందు మాట ఇచ్చి, మోసం చేయడంతో సమాధానం చెప్పలేని దుస్థితి. అన్ని వ్యవస్థలు నాశనం. నిర్వీర్యం చేశారని మండిపడ్డారు వైసీపీ అధినేత వైఎస్ జగన్..

## కరాచీ, లాహోర్, రావల్పిండి సహా 9 ప్రాంతాల్లో భారత్ డ్రోన్ దాడులు: పాక్ ఆర్మీ..



**న్యూఢిల్లీ,:** భారత్, పాకిస్తాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్తాన్ ఆర్మీ సంచలన ఆరోపణలు చేసింది. ఈ రోజు ఉదయం పాకిస్తాన్ లాహోర్‌తో పాటు ఇతర నగరాల్లో పేలుడు శబ్దాలు వినిపించడంతో ఒక్కసారికి పాక్ ప్రజల్లో వణుకు పట్టింది. భారత్ మళ్లీ దాడి చేస్తుందా..? అనే అనుమానాలు పాక్ ప్రజలు వ్యక్తపరిచారు. అయితే, తాజాగా పాక్ ఆర్మీ మీడియా విభాగం ఐఎస్‌పీఆర్ సంచలన ఆరోపణలు చేసింది. ఈ పేలుళ్లకు భారత్ కారణమని ఆరోపించింది. తాము ఇండియాకు చెందిన 12 డ్రోన్లను కూల్చామని పాక్ ఆర్మీ చెబుతోంది. పాకిస్తాన్‌లోని కరాచీ, లాహోర్, రావల్పిండి, గుజ్రాన్‌వాలా, అటాక్, బహావల్పూర్ వంటి నగరాలపై డ్రోన్ అటాక్స్ జరిగాయని ఐఎస్‌పీఆర్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి ఆరోపించారు. డ్రోన్ దాడుల తర్వాత కిస్తాన్ విమానాశ్రయాల అథారిటీ కరాచీ, లాహోర్, ఇస్లామాబాద్, ఫైసలాబాద్ మరియు సియాల్‌కోట్ ప్రధాన విమానాశ్రయాలలో విమాన కార్యకలాపాలను నిరవధికంగా నిలిపివేసినట్లు పాక్ మీడియా వెల్లడించింది. విమానయాన అధికారులు "నోటీస్ టు ఎయిర్‌మెన్" ద్వారా అన్ని విమానయాన సంస్థలకు దీని గురించి తెలియజేశారు. పాక్ మీడియా ప్రకారం, లాహోర్‌కు వచ్చే అన్ని విమానాలను కరాచీ విమానాశ్రయానికి మళ్లించారు, ఇందులో జెడ్డా, దుబాయ్, మస్కట్, షార్జా మరియు మదీనా నుండి వచ్చే విమానాలు కూడా ఉన్నాయి. ముందు జాగ్రత్త చర్యగా లాహోర్‌లోని అల్లామా ఇక్బాల్ అంతర్జాతీయ విమానాశ్రయం, సియాల్‌కోట్ విమానాశ్రయాలను ఖాళీ చేయించారు. కరాచీ జిన్నా విమానాశ్రయం కూడా మూసి వేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే, గురువారం ఉదయం, లాహోర్‌లోని వాల్టన్ రోడ్ మరియు పరిసర ప్రాంతాల్లో ఒకదాని తర్వాత ఒకటి మూడు పెద్ద పేలుళ్లు వినిపించాయి, దీనితో భయాందోళనలు చెలరేగాయి మరియు ప్రజలు భయంతో ఇళ్ల నుండి బయటకు వచ్చారు. మూడు పేలుళ్లు కొన్ని సెకన్లలోనే జరిగాయని, వాటి శబ్దాలు అనేక కిలోమీటర్ల దూరం వినిపించాయని లాహోర్ పోలీసులు తెలిపారు.

## జైపూర్‌లో హైఅలర్ట్.. సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంకు బాంబు బెదిరింపు





**న్యూఢిల్లీ,:** ఆపరేషన్ సింధూర్' విజయంతో దేశమంతా ఉత్సాహంగా ఉన్న వేళ, రాజస్థాన్‌లోని జైపూర్‌లో మాత్రం భయానక వాతావరణం నెలకొంది. సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో బాంబు పెట్టినట్లు బెదిరింపు మెయిల్ రావడంతో నగరంలో హై అలర్ట్ ప్రకటించారు.రాజస్థాన్ రాష్ట్ర క్రీడా మండలికి ఈ బెదిరింపు సందేశం మెయిల్ ద్వారా ఉదయం 9:13 గంటల ప్రాంతంలో అందింది. "ఆపరేషన్ సింధూర్ విజయానికి గుర్తుగా మీ స్టేడియంలో బాంబు పేలుస్తాం" అంటూ ఆ మెయిల్‌లో హెచ్చరించడంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఈ ఘటన, భారత సాయుధ దళాలు పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాదాపు 100 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఒక రోజు తర్వాత చోటుచేసుకుంది. కేవలం 25 నిమిషాల వ్యవధిలో, భారత్ బాలాకోట్ తర్వాత అతిపెద్ద సరిహద్దు దాటి దాడులను నిర్వహించింది. 'ఆపరేషన్ సింధూర్' పేరుతో జరిగిన ఈ మెరుపు దాడుల్లో వైమానిక, నావికా , భూతల దళాలు పాల్గొన్నాయి. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో 26 మంది పౌరులను బలిగొన్న ఉగ్రదాడికి ప్రతీకారంగా చీకటిలో ఈ ఆపరేషన్ జరిగింది. అగ్రశ్రేణి వర్గాల సమాచారం ప్రకారం, నిషేధిత జైషే మహ్మద్ , లష్కరే తోయిబా , హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన దాదాపు 100 మంది ఉగ్రవాదులు ఈ ఖచ్చితమైన దాడుల్లో హతమయ్యారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగానే ఈ లక్ష్యాలను ఎంపిక చేశామని ప్రభుత్వం ఒక విలేకరుల సమావేశంలో తెలిపింది. బెదిరింపు మెయిల్ రాగానే జైపూర్ పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. సవాయ్ మాన్‌సింగ్ స్టేడియం చుట్టుపక్కల భారీగా పోలీసు బలగాలను మోహరించారు. స్టేడియం లోపల ఉన్న వారందరినీ తక్షణమే బయటకు పంపించివేశారు. అంతేకాకుండా, స్టేడియం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న వారిని కూడా ఖాళీ చేయించారు. బాంబు స్క్వాడ్‌లు స్టేడియం లోపల , వెలుపల క్షుణ్ణంగా గాలిస్తున్నారు. నగరంలో భయాందోళనలు నెలకొన్నప్పటికీ, పోలీసులు ప్రజలకు ధైర్యం చెబుతూ భద్రతా చర్యలు పర్యవేక్షిస్తున్నారు. ఈ బెదిరింపు వెనుక ఎవరున్నారనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. 'ఆపరేషన్ సింధూర్' విజయం తర్వాత దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈ ఘటన మరింత ఆందోళన కలిగిస్తోంది.

# అదనుచూసి పదునైన పారం!




తీరికూర్చుని భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో జగడాలమారి పాకిస్తాన్‌కూ, దాని కీలుబొమ్మలైన ఉగ్రమూకలకూ తెలిసొచ్చి ఉండాలి. 2016 నాటి 'ఉరి' సర్జికల్ దాడులు, 2019 నాటి బాలాకోట్ వైమానిక దాడులకు అనేక రెట్లు అధికంగా మంగళవారం అర్ధరాత్రి దాటాక 'ఆపరేషన్ సిందూర్' సంకేతనామంతో మన త్రివిధ దళాలు పకడ్బందీ సమన్వయంతో పాకిస్తాన్‌లోనూ, ఆక్రమిత కశ్మీర్ లోనూ తొమ్మిది చోట్ల గంటసేపు సాగించిన క్షిపణి దాడులు పాక్ సైన్యాన్నీ, ఉగ్రమూకల్నీ గుక్క తిప్పుకోనీయకుండా చేశాయి. ఉగ్రవాదుల శిక్షణ కేంద్రాలూ, వారి ఆయుధ గిడ్డంగులూ, ఇతరేతర అవసరాలకు వినియోగిస్తున్న బహుళ అంతస్తుల భవంతులూ లక్ష్యంగా మొత్తం 24 చోట్ల సాగించిన దాడుల్లో 70 మంది వరకూ ఉగ్రవాదులు మరణించగా, మరో 60 మంది గాయపడ్డారని చెబుతున్నారు. ఉగ్రవాద ముఠాలైన జైషే మొహమ్మద్ (జేఈఎం), లష్కరే తోయిబా(ఎల్ఈటీ) ప్రధాన కార్యాలయాలు రెండూ కుప్పకూలాయని సమాచారం. జేఈఎం చీఫ్ మసూద్ అజర్ సోదరితోసహా అతగాడి కుటుంబానికి చెందిన పదిమంది హతమయ్యారని కూడా చెబుతున్నారు. జరిగిన నష్టాన్ని కప్పెట్టే ఎత్తుగడతో అయిదు భారత్ విమానాలను కూల్చామంటూ పాక్ స్వోత్కర్షలకు పోతోంది. సంప్రదాయానికి భిన్నంగా ఈసారి పాక్ లోలోపలివరకూ చొచ్చుకెళ్లి దాడులు సాగించిన తీరూ, ఒక్క క్షిపణి కూడా గురితప్పకుండా శత్రుమూకలపై చంద్రనిప్పులు కురిపించిన విధానం మన త్రివిధ దళాల పకడ్బందీ అంచనాలకూ, పదునైన వ్యూహచతురతకూ దర్పణాలు. పాక్ గడ్డపై గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఉగ్రశిబిరాల ఆనుపానుల్ని శత్రునేత్రానికి చిక్కని విధంగా గత పక్షం రోజులుగా మానవ రహిత విమానాలతో జల్లెడపట్టాకే ఈ దాడులు జరిగాయి. పహల్‌గామ్ సమీపంలో అకారణంగా, అన్యాయంగా నిరాయుధ భారత పౌరులను గురిచూసి కాల్చిచంపటానికి కిరాయిమూకల్ని పంపి కొన్నిరోజులుగా పాకిస్తాన్ మురుస్తోంది. దీనిపై నిలదీస్తే షరా మామూ లుగా సాక్ష్యాలడుగుతోంది. గత నెల 22న పహల్‌గామ్ సమీపంలో ఉగ్రవాద ముఠా 26 మందిని పొట్టనబెట్టుకున్నప్పటి నుంచీ భారత ప్రజ ప్రతీకారంతో రగిలిపోతోంది. కంటికి కన్ను సిద్ధాంతం పాటించి గట్టి దెబ్బతీయాల్సిందేనన్న అభిప్రాయం అలుముకుంది. ఈ నేపథ్యంలో మన దళాల దాడులు విజయవంతం కావటం అందరినీ సాంత్వన పరుస్తుందనటంలో సందేహం లేదు. అనుకోని పరిణామాలు తలెత్తితే అనుసరించాల్సిన పద్ధతులపై పౌరులకు అవగాహన కల్పించటానికి బుధవారం మాక్ డ్రిల్ జరగటం, అంతకుముందు రోజు రాత్రే మన త్రివిధ దళాలు దాడులు చేయటం గమనిస్తే వర్తమానం ఎంత జటిలంగా ఉన్నదో అర్థమవుతుంది. ఇది మనం కోరుకున్నది కాదు. మన ప్రమేయం లేకుండా వచ్చిపడిన విపత్తు. అకారణంగా మనపై రుద్దిన సంక్లిష్ట సమస్య. దీనికి దీటుగా స్పందించకపోతే ఉగ్రదాడులకు అంతూ పొంతూ ఉండదు. కనుకనే పహల్‌గామ్ మారణకాండ గురించి తెలియగానే ప్రధాని నరేంద్ర మోదీ సౌదీ పర్యటనను రద్దుచేసుకుని వెను దిరిగారు. ఆ వెంటనే మంత్రివర్గ సహచరులతో, త్రివిధ దళాల అధిపతులతో వరస సమాలోచనలు సాగించారు. ఎప్పుడు, ఎక్కడ ఎలా దాడులు సాగించాలో, తీవ్రత ఏ స్థాయిలో వుండాలో మీరే నిర్ణ యించండంటూ మన దళాలకు అధికారం ఇచ్చారు. పర్యవసానంగానే పాక్ ప్రాపకంతో చెలరేగిపోతున్న ఉగ్రముఠాలకు గట్టి సమాధానం వెళ్లింది. ఈ దాడులకు చాలాముందే ఇతరేతర నిర్ణ యాలు తీసుకున్నారు. సింధూ నదీజలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపేస్తున్నట్టు ప్రకటించ టంతోపాటు ఇండియా పలు చర్యలు తీసుకుంది. దీన్నంతటినీ గమనిస్తున్నవారికి మన దేశం సైనిక చర్యకు కూడా వెనకాడబోదని పక్షం రోజుల క్రితమే అర్థమైంది. యుద్ధం దేనికీ పరిష్కారం కాకపోవచ్చు. చర్చలే అంతిమంగా ఎంతటి జటిల సమస్యనైనా పరిష్కరిస్తాయన్న సిద్ధాంతం కూడా సరైనదే కావొచ్చు. కానీ పొరుగు పచ్చగావుంటే ఓర్వలేక నిష్కారణంగా దాడులకు దిగే నైజాన్ని శాంతిప్రవచనాలతో ఎదుర్కొనటం సాధ్యమేనా? ఒకపక్క పహల్‌గామ్ దాడులతో సంబంధం లేదంటూనే గత కొన్ని రోజులుగా అధీనరేఖ వద్దా, అంతర్జాతీయ సరిహద్దు వద్దా పాక్ ఎలాంటి కవ్వింపూ లేకుండా కాల్పులకు దిగుతోంది. ఈ దాడుల కారణంగా ఒక్క బుధవారంనాడే పూంఛ్ జిల్లా గ్రామాల్లో 12 మంది పౌరులు బలయ్యారు. తన దుష్ట పన్నాగాలను కప్పిపుచ్చటానికి భద్రతామండలిలో పాకిస్తాన్ అమాయకత్వం నటిస్తూ భారత్ తీసు కుంటున్న వరస చర్యలకు వ్యతిరేకంగా తీర్మానం చేయించాలని విఫలయత్నం చేసింది. రేపో మాపో అది నేరుగా సైన్యాన్ని రంగంలోకి దించి ప్రతీకారం పేరిట చెలరేగే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఉగ్రముఠాల ద్వారా మారణహోమానికి పాల్పడటం కన్నా ఒకరకంగా ఇది మంచిదే. భారత్ బెదిరిపోయి సైనిక దాడుల ఆలోచన మానుకుంటుందన్న తప్పుడు ఆలోచనతో కొన్ని రోజులుగా అది అణుబాంబు బెదిరింపులకు కూడా తెగించింది. ఆ దుస్సాహసానికి పూనుకుంటే చేజేతులా స్వీయవినాశనాన్ని కొనితెచ్చుకున్నానని పాక్ పశ్చాత్తాపపడే రోజు ఎంతో దూరంలో ఉండదు. ఈ కష్టకాలంలో దేశ ప్రజానీకం కుల మత భేదాలు మరిచి కలిసికట్టుగా ఉండటం అత్య వసరం. ఇదే అదనుగా నాలుగు ఓట్ల కోసమో, మరికొన్ని సీట్ల కోసమో ప్రజల్లో వైషమ్యాలు సృష్టించాలని చూసే అవాంఛనీయ శక్తుల్ని అందరూ సకాలంలో పోల్చుకుని దూరం పెట్టడం, తగిన బుద్ధి చెప్పటం ఎంతో అవసరం. మనలోని సమష్టితత్వమే ఎంతటి విపత్తునైనా ఎదుర్కొనే ధైర్యాన్ని స్తుంది. విజయాన్ని మన చేతికందిస్తుంది.

# రవీంద్రుడు.. దేశభక్తి పరాయణుడు



ఒక కలం, ఒక గళం, ఒక పదమై, ఒక పాటై, ఒక సంగీతమై, కవిత్వమై, రచనా వ్యాసంగమై కేవలం వంగ భూమినే కాకుండా యావత్ భారతాన్ని, ప్రపంచాన్ని అలరించింది. రవీంద్రనాథ్ ఠాగూర్‌ను సాహితీ వినీలాకాశంలో ధ్రువతారగా నిలబెట్టింది. విశ్వకవిగా పేరుగడించిన రవీంద్రనాథ్ ఠాగూర్ బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణించాడు. కవిగా, రచయితగా, సంఘసంస్కర్తగా బహుముఖ పాత్ర పోషించాడు. అనితర సాధ్యమైన ప్రజ్ఞాపాటవాన్ని ప్రదర్శించాడు. బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా గళమెత్తాడు. బెంగాల్ పునరుజ్జీవన ఉద్యమంలో కీలక భూమిక పోషించాడు. భారతదేశానికి అర్థవంతమైన జాతీయ గీతం 'జనగణమన..' రచించాడు. బంగ్లాదేశ్ జాతీయ గీతాన్ని కూడా రవీంద్రుడు రచించాడు. ఎక్కడ ప్రతిభ ఉన్నా గుర్తించి గౌరవించడం వలన మన గొప్పదనం ప్రస్ఫుటమవుతుంది. మన వ్యక్తిత్వం సమాజానికి అవగతమవుతుంది. దురదృష్ట వశాత్తూ ఇలాంటి లక్షణాలు వర్తమాన సమాజంలో మచ్చుకైనా కానరావు. అహం స్వవినాశనానికి దారితీయడమే కాకుండా, సమాజ వికాసానికి కూడా అడ్డుకట్టగా మారుతుంది. ప్రజ్ఞాపాటవాలు స్వయం కృషితో మాత్రమే సిద్ధిస్తాయి. ఆసక్తి, పట్టుదల వలన అనితర సాధ్యమైన ప్రతిభ స్వంతమవుతుంది. ఎలాంటి కృషిలేకుండా వడ్డించిన విస్తరిలా ప్రతిభ మన ముంగిట వాలదు. ప్రతిభను ప్రపంచానికి వెల్లడి కాకుండా అడ్డుకోవడం వలన అంతిమంగా నష్టమే వాటిల్లుతుంది. ఇతరులలోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడం వలన సమాజానికి మేలు జరుగుతుంది. ప్రతిభకు ఎల్లలులేవు. భాషాభేదాలు అడ్డురావని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నిరూపించాడు. బెంగాలీ భాష పట్ల అమితమైన అభిమానమున్నా, ఇతర భాషల్లోని సాహిత్యాన్ని ఆస్వాదించి, అభినందించి, భారతదేశాన్ని ప్రపంచ సాహితీ రంగంలో అగ్రపథంలో నిలిపిన రవీంద్రుడు విశ్వకవిగా విశేష ఖ్యాతినార్జించాడు. రవి గాంచని చోటును కవి గాంచునన్న నానుడిని నిజం చేసిన రవీంద్రుని ప్రతిభ అనన్యసామాన్యం. తన ఆలోచనలను కవితీకరించి పాశ్చాత్య ప్రపంచానికి సైతం అందించిన ఘనత రవీంద్రునిదే. రవీంద్రుని బాల్యమంతా దాదాపుగా ఒంటరిగానే గడిచింది. సహజమైన విద్యకు అలవాటుపడ్డ రవీంద్రుడు స్వేచ్ఛయుతమైన, జ్ఞానసంపన్నమైన, భయం లేని నూతన ప్రపంచం కోసం పరితపించాడు. బాల్యంలోనే ఒక మంచి కవిగా, రచయితగా పేరు గడించాడు. విమర్శకుల ప్రశంసలు పొందాడు. శాంతి నికేతన్‌ను స్థాపించి, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాడు. గురువులకు, విద్యార్థులకు మధ్య అవ్యాజ్యమైన ఆత్మీయతలతో కూడిన వాతావరణాన్ని సృష్టించాడు. సాహిత్యం పట్ల, కళల పట్ల విద్యార్థులకు మక్కువ కలిగించాడు. రవీంద్ర నాథ్ ఠాగూర్ 'గీతాంజలి' విశ్వవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. సాహిత్యంలో నోబెల్ బహుమతిని సంపాదించి పెట్టింది. భారతదేశంలోనే కాదు ఆసియాలో తొలి నోబెల్ బహుమతి గ్రహీతగా రవీంద్రునికి అవకాశం దక్కింది. 'గీతాంజలి' రవీంద్రుని సాహితీ వనంలో విరబూసిన మనోహరమైన కవితాకుసుమం. రవీంద్రుని కావ్య శైలికి, సహజత్వానికి, చైతన్యవంతమైన, అర్థవంతమైన ప్రపంచ నిర్మాణానికి 'గీతాంజలి' ఒక మచ్చుతునక. ప్రకృతిని ఆస్వాదిస్తూ, ప్రకృతి ఒడిలో ప్రశాంతమైన వాతావరణంలో పెరుగుతూ, పెద్దలను గౌరవిస్తూ, క్రమశిక్షణతో జ్ఞానాన్ని ప్రసాదించే చదువులను అభ్యసిస్తూ, సృజనాత్మకతను అలవరచుకుని రవీంద్రనాథ్ ఠాగూర్ బహుముఖ ప్రజ్ఞాపాటవాలను స్ఫూర్తిగా తీసుకుని, ఆయన ఆదర్శాలను దేశభక్తిని, మానవతావాదాన్ని పెంపొందించుకోవాలి. అదే విశ్వకవికి మన మందించే నిజమైన నివాళి.

# వేధింపులే దర్యాప్తు సంస్థల పనా?




విధి నిర్వహణలో దర్యాప్తు సంస్థల పాత్ర తరచూ వివాదాస్పదమవుతోంది. బాధ్యతాయుతంగా దర్యాప్తు చేపట్టి, నేరాలకు ముకుతాడు వేయడంలో కీలకపాత్ర పోషించవలసిన దర్యాప్తు సంస్థలు అధికారంలో ఉన్నవారికి కొమ్ము కాస్తున్నాయని, పాలకుల చేతిలో కీలుబొమ్మలుగా మారుతున్నాయని తరచూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విపక్ష పార్టీలు ఈ రకమైన ఆరోపణలు చేయడాన్ని అర్థం చేసుకోవచ్చు కానీ, ప్రజాస్వామికవాదులు, న్యాయస్థానాలు సైతం దర్యాప్తు సంస్థల పనితీరుపై అనుమానాలు వ్యక్తం చేయడం గమనించవలసిన విషయం. ఒకప్పుడు కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)పై మాత్రమే ఆరోపణలు ఉండేవి. కానీ, కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చాక, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ (ఐటి) వంటి సంస్థలకు కూడా ఈ మకిలి అంటింది. రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపునకు ఈ రెండూ కేంద్రం చేతిలో పావులుగా మారాయంటూ విమర్శలు రావడం పరిపాటిగా మారింది. తాజాగా చత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ కేసు విషయంలో సర్వోన్నత న్యాయస్థానం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వ్యవహార శైలిపై తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. 'మూడు చార్జిషీట్లు దాఖలయ్యాయి. మీరు నిందితుడిని కస్టడీలో ఉంచి శిక్షిస్తున్నారు. విచారణ ప్రక్రియనే శిక్షగా మార్చారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. సరైన ఆధారాలు సేకరించకుండా కొందరు వ్యక్తులపై అభియోగాలు మోపుతున్న తీరును విమర్శిస్తూ, ఎప్పుడూ ఇదే తీరంటూ ఈసడించింది. ఆమాటకొస్తే, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను న్యాయస్థానాలు తప్పుపట్టడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది ఆగస్టులోనూ ఓ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇడిని తీవ్రస్థాయిలో మందలించింది. 'ఏ వ్యక్తి స్వేచ్ఛనూ హరించకూడదు. వ్యక్తి స్వేచ్ఛ అనేది ఒక నియమమే. దాన్ని కోల్పోవడమనేది మినహాయింపుగానే ఉండాలి. ఆ స్వేచ్ఛపై నియంత్రణ విధిస్తే అది చట్టబద్ధంగానే జరగాలి. బెయిలివ్వడానికి మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 45 ప్రకారం రెండు షరతులు ఉన్నాయి. అంతమాత్రాన వ్యక్తి స్వేచ్ఛను హరించడమే ప్రమాణమని ఆ నిబంధన ఎక్కడా చెప్పలేదు' అని చీవాట్లు పెట్టింది. వ్యక్తులను అరెస్టు చేయడానికి, రోజుల తరబడి కస్టడీలో ఉంచడానికి మనీలాండరింగ్ చట్టం ఇడికి ఒక ఆయుధంగా మారిందనేది సర్వత్రా వినిపిస్తున్న విమర్శ. నిందితులను జైలుకు పరిమితం చేసేందుకు ఈ చట్టం ఉపయోగపడుతోందన్నది పలువురి అభియోగం. ఈ చట్టం కింద నమోదైన కేసులు ఎక్కువ కాలం పెండింగులో ఉంటున్న మాట వాస్తవమేనంటూ ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరే స్వయంగా అంగీకరించడం చట్టం అమలులోని లొసుగులను బహిర్గతం చేస్తోంది. మామూలు నేరాల్లో ఎవరిపైనైనా కేసు నమోదు చేస్తే ఎఫ్ఐఆర్ దాఖలు చేసి, దాన్ని సదరు వ్యక్తికి అందజేయడం తప్పనిసరి. ఇడి కేసుల్లో ఇలా ఇసిఐఆర్‌ను విడుదల చేస్తారు. కానీ దాన్ని నిందితులకు తప్పనిసరిగా ఇవ్వాలన్న నిబంధన మనీలాండరింగ్ చట్టంలో లేదు. పైగా ఈ చట్టం కింద ఇడి అధికారులు ఎవరికైనా సమన్లు పంపి విచారించే అధికారం ఉంటుంది. తాను సాక్షినో, ముద్దాయినో సదరు వ్యక్తికి తెలియదు. ఇలా ఇడి అధికారులకు అపరిమితమైన అధికారాలు కట్టబెట్టిన మనీలాండరింగ్ చట్టంవల్ల నిందితులకు బెయిల్ దొరకడం దుర్లభమవుతోందనే విషయం ఇప్పటికే అనేక కేసులలో రుజువైంది కూడా. ఈ చట్టంపై వెల్లువెత్తుతున్న విమర్శలను, దాఖలవుతున్న పిటిషన్లను గమనించిన సర్వోన్నత న్యాయస్థానం 2022లో ఈ చట్టం కింద ఇడికి తాను స్వయంగా దాఖలు పరచిన అధికారాలను పునస్సమీక్షించేందుకు ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేయడం తాజా పరిణామం. ఇరవైరెండేళ్ల క్రితం రూపొందిన ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ చట్టం (పిఎంఎల్ఎ)2005 జూలైనుంచి అమలులోకి వచ్చింది. అయినా తొలినాళ్లలో ఈ చట్టం అంత ప్రభావవంతంగా అమలు కాలేదు. పిఎంఎల్ఎ కింద తొలి చార్జిషీటు 2012 లో దాఖలైందంటే దర్యాప్తు సంస్థ పనితీరు ఎంత నత్తనడకగా ఉండేదో అర్థం అవుతుంది. అయితే, 2014లో కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడ్డాక, ఇడి దూకుడు పెరిగింది. వరుస కేసుల నమోదుతో ఆర్థిక నేరగాళ్ల గుండెల్లో గుబులు పుట్టించింది. అయితే, ఈ దూకుడు వెనక అప్పటి కేంద్రంలోని పెద్దల హస్తం ఉందనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మనీలాండరింగ్ చట్టంలో లోటుపాట్లను సవరించేందుకు సుప్రీంకోర్టు నడుం బిగించడంతో ఇకపై నిందితులకు ఊరట లభిస్తుందని భావించవచ్చు. మరోవైపు, ఆర్థిక చట్టాల అమలులోనూ, ఆర్థికపరమైన నేరాలను అరికట్టడంలోనూ కీలకపాత్ర వహించే ఇడి ఇకనైనా స్వతంత్రంగా వ్యవహరించవలసిన అవసరం ఉంది. పాలకుల చేతిలో కీలుబొమ్మగా మారిందనే అపప్రథను తొలగించుకోవాలంటే, ముందుగా రాజకీయ నేతల ఉచ్చులోంచి బయటపడాలి. నేతల ఒత్తిళ్ళకు లొంగకుండా పనిచేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.




EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com